శనివారం
26-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 154
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షుడిగా పల్లవ్ సేన్ గుప్తా

వియత్నాంలో జరుగుతున్న 22వ ప్రపంచ శాంతి సంఘం (డబ్ల్యూపీసీ) సమావేశాలు విజయవంత మయ్యాయి. డబ్ల్యూపీసీ అధ్యక్షుడిగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి పల్లవ్ సేన్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8లో

విద్యా, ఉపాధి కోసం

దద్దరిల్లిన ఢిల్లీ

పార్లమెంట్ మార్చ్‌కు భారీగా విద్యార్థి, యువజనులు

- జన్‌పథ్ నుంచి జంతర్‌మంతర్ వరకు నిరసన ప్రదర్శన
- భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమల్లోకి తేవాలి
- ప్రభుత్వ శాఖల్లో పోస్టులు భర్తీ చేయాలంటూ డిమాండ్
- నిరుద్యోగులకు మోదీ దగా: ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిరుద్యోగ యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థి, యువజనులు గర్జించారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధిహామీ చట్టం అమల్లోకి తేవాలని, ప్రభుత్వ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ మార్చ్ ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ శ్రేణులు తరలివెళ్లారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల్ని ఎండగట్టారు. జన్‌పథ్ నుంచి జంతర్‌మంతర్ వరకు నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని నినదించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి, ఎనిమిదేళ్లయినా నేటికి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారన్నారు. సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నిస్తే...నిరుద్యోగులు పకోడీ బండ్లు పెట్టుకుని బతకండి అంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 27లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, దేశవ్యాప్తంగా యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌ను అమలులోకి తీసుకురావాలని డిమాండ్

- మిగతా 2 లో

అమ్మేసేందుకే ఆరాటం!
కోల్ ఇండియా... హిందుస్థాన్ జింక్‌కూ ఎసరు 2 లో

కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర
ఆరోపణను తోసిపుచ్చిన కాషాయ పార్టీ 2 లో

ప్రాణాలు పోయినా భూములు వదులుకోం
2 లో

కొత్త సీఎస్ జవహర్ రెడ్డి ?

నెలాఖరున సమీర్‌శర్మ పదవీ విరమణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా జవహర్‌రెడ్డిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత సీఎస్ సమీర్‌శర్మ ఈ నెలాఖరున రిటైర్ కానున్నారు. దీంతో కొత్త సీఎస్ నియామకంపై ఏ నిమిషంలోనైనా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కొత్త సీఎస్ రేసులో నలుగురు, ఐదుగురు సీనియర్ ఐఏఎస్‌లు ఉన్నప్పటికీ ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జవహర్ రెడ్డిని సీఎం విధేయుడిగా, సమర్థుడిగా భావిస్తున్నట్లు తెలిసింది. తొలుత కొత్త సీఎస్ రేసులో 1988 బ్యాచ్‌కి చెందిన ఎర్రా శ్రీలక్ష్మీ, పూనం మాలకొండయ్య, నీరబ్‌కుమార్ ప్రసాద్, జవహర్‌రెడ్డి పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిలో సీఎం జగన్‌పై నమోదైన అక్రమాస్తులో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మికి సీఎస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఐఏఎస్‌ల్లో చర్చ సాగింది. ఆమె జగన్‌తో పాటు చంచల్‌గూడ జైలులో కొంతకాలం జైలు జీవితం గడిపినందున ఆమెపై సీఎంకు సహజంగానే సానుభూతి ఉంటుంది. ఆ నేపథ్యంలోనే తెలంగాణ కేడర్‌కు చెందిన ఆమెను జగన్ పట్టుబట్టి ఏపీకి తీసుకురావడంతోపాటు, వెంట వెంటనే పదోన్నతులు కల్పించి కీలక శాఖలు బాధ్యతలు అప్పగించారని అధికారులు చర్చించుకున్నారు. సీఎస్‌గా కూడా ఆమెకే పదోన్నతి ఖాయమని అంచనా వేశారు. ఈ విషయం ఐఏఎస్‌ల్లో, ప్రభుత్వ అధికారుల్లో పెద్ద చర్చనీయాంశం కావడంతో జవహర్ రెడ్డి వైపు సీఎం మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో సీఎం నిర్ణయం మారితే తప్ప దాదాపు జవహర్ రెడ్డికి సీఎస్‌గా నియామకం ఖరారైనట్లు సమాచారం.

హైకోర్టు జడ్జిల బదిలీ

వివక్షాపూరితం

- నిరసనకు దిగిన న్యాయవాదులు
- కొలీజియం సిఫార్సుపై మండిపాటు
- తక్షణమే బదిలీలు ఆపాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: హైకోర్టు జడ్జిల బదిలీల అంశం న్యాయరంగంలో చిచ్చు రేపింది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు వివక్షతో కూడుకున్నదని న్యాయవాదులు మండిపడ్డారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దేవానంద్, జస్టిస్ డీ రమేష్ బదిలీలకు నిరసనగా శుక్రవారం ఉన్నత న్యాయస్థానం ఎదుట న్యాయవాదులు విధులు బహిష్కరించి పెద్దసంఖ్యలో నిరసనలకు దిగారు. హైకోర్టులో న్యాయవాదుల బదిలీ కక్షపూరితంగా చేపట్టారని వారు ఆరోపించారు. కొలీజియం వెంటనే తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఇటీవల ఇదే పద్ధతిలో బదిలీ చేసిన గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి బదిలీని వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఈనెల 24వ తేదీ వివిధ హైకోర్టుల నుంచి ఏడుగురు న్యాయమూర్తులను ఇతర హైకోర్టులకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఇందులో తెలంగాణ హైకోర్టు నుంచి ముగ్గురు, ఆంధ్రప్రదేశ్, మద్రాస్ హైకోర్టుల నుంచి ఇద్దరి చొప్పున న్యాయమూర్తులున్నారు. తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ కన్నెగంటి లలితను కర్ణాటక హైకోర్టుకు, జస్టిస్ డాక్టర్ డి.నాగార్జునను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిని పాట్నా హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ బట్టు దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ డి.రమేష్‌ను అలహాబాద్ హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు నుంచి జస్టిస్ వి.ఎం.వేలుమణిని కలకత్తా హైకోర్టుకు, జస్టిస్ టి.రాజాను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణ హైకోర్టులో గురువారం నుంచే న్యాయవాదులు నిరసనలు తెలుపుతుండగా శుక్రవారం ఏపీ హైకోర్టులోనూ న్యాయవాదులు నిరసనలకు దిగారు. కొలీజియం నిర్ణయాన్ని నిరసిస్తూ మాకు న్యాయం కావాలని నినాదాలు చేశారు. అక్రమ బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. జడ్జిల బదిలీలు పారదర్శకంగా జరగలేదని, అకారణంగా, నిరంకుశంగా చేశారని ఆరోపించారు. చట్టాలను ఉల్లంఘిస్తే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఎటువంటివారినైనా న్యాయమూర్తి బట్టు దేవానంద్ కోర్టుకు పిలిపించి శిక్షలు వేశారని హైకోర్టు సీనియర్ న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ గుర్తుచేశారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు, కొలీజియంకు

- మిగతా 2 లో

400 రోజులు 4వేల కిలోమీటర్లు

- కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు
- జనవరి 27నుంచి పాదయాత్ర
- అధికారికంగా ప్రకటించిన లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గద్దె నెక్కించడమే లక్ష్యంగా, వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టేందుకు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. 2014 ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన పాదయాత్ర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రిషికొండలో పర్యావరణ

విధ్వంసం

- రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- అక్కడ సీఎం కార్యాలయం తరహా నిర్మాణాలు లేవు
- విల్లాలు... ఫంక్షన్ హాళ్లు... రెస్టారెంట్ల నిర్మాణాలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విశాఖ: విశాఖలోని రిషికొండలో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ విధ్వంసానికి పాల్పడిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. హైకోర్టు అనుమతితో శుక్రవారం ఆయన రిషికొండ తవ్వకాలను, అక్కడి నిర్మాణాలను పరిశీలించారు. రిషికొండకు కొంచెం దూరంలో నారాయణ వాహనాన్ని పోలీసులు ఆపివేశారు. అక్కడి నుంచి ప్రభుత్వ వాహనంలో ఆయనను రిషికొండకు తీసుకెళ్లారు. మిగతా వారెవరికీ అనుమతి లేదని దూరంగా నిలిపివేశారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి రుషికొండ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ద్విచక్ర వాహనదారులను గుర్తింపు కార్డులు అడిగి, ఎక్కడికి వెళుతున్నారని ఆరా తీసి పంపించారు. దాదాపు గంటన్నర సేపు రిషికొండను పరిశీలించిన అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడారు. రిషికొండను పెద్ద ఎత్తున తొలిచివేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి విధ్వంసానికి పాల్పడిందని దుయ్యబట్టారు. దీనికి రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. తవ్వకాల ద్వారా సహజ సిద్ధమైన రిషికొండను ధ్వంసం చేశారని అన్నారు. సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తే పునరుద్ధరించటం సాధ్యం కాదని తెలిపారు. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా రుషికొండలో ముఖ్యమంత్రి కార్యాలయం తరహా నిర్మాణాలు జరగడం లేదని అన్నారు. విలాసవంతమైన విల్లాలు, గదులు, ఫంక్షన్ హాలు, రెస్టారెంట్లు నిర్మిస్తున్నారని చెప్పారు. వీటి నిర్మాణం కోసం రిషికొండను ధ్వంసం

- మిగతా 2 లో

మాస్కోలో ఫిడెల్ కాస్ట్రో కాంస్య విగ్రహావిష్కరణ

మాస్కో: క్యూబా విప్లవ నేత ఫిడెల్ కాస్ట్రో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని రష్యా రాజధాని మాస్కోలో ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని శిల్పి అలెగ్జీ ఛబానెన్కో తయారు చేశారు. సైనిక యూనిఫారంలో 'క్యూబా' అని రాసి ఉన్న ఓ రాయిపై నడుం మీద చేతులు పెట్టుకొని నిలుచొని ఏదో దూరాలోచన ఉన్నట్లుగా కాస్ట్రో విగ్రహాన్ని తయారు చేశారు. మాస్కోలోని నోవోపెస్చానయా వీధి సమీపంలోని ఫిడెల్‌కాస్ట్రో స్క్వేర్ వద్ద ఈ స్మారకాన్ని నెలకొల్పారు. విగ్రహావిష్కరణలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనల్ పాల్గొన్నారు. కాస్ట్రో విగ్రహం పోరాటంలో ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతోందని మిగుల్ అన్నారు. పుతిన్ కూడా ముందుచూపుగల నాయకుడి వ్యక్తిత్వానికి అందంగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య మిత్రబంధాన్ని మరింత పటిష్టపర్చుకోవాలని ఇద్దరు అధ్యక్షులు సంకల్పించారు. రెండు దేశాలపై అమెరికా ఆంక్షలు విధించిన విషయం విదితమే.

సోషలిస్టు దేశాల సమన్వయానికి ప్రతిబింబం

క్యూబా-చైనా స్నేహబంధం గురించి జిన్‌పింగ్

మిగుల్ డియాజ్-కెనల్‌తో భేటీ

బీజింగ్: చైనా, క్యూబా దేశాల మధ్య స్నేహం సోషలిస్టు దేశాల మధ్య సమన్వయానికి ప్రతిబింబం అని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. ఆయన శుక్రవారం క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ తొలి కార్యదర్శి, ఆ దేశాధ్యక్షుడు మిగుల్ డియాజ్-కెనల్ బెర్ముడెజ్‌తో సమావేశమయ్యారు. గతనెలలో జరిగిన 20వ సీపీసీ జాతీయ మహాసభల తర్వాత చైనాను సందర్శించిన తొలి లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాధినేత మిగుల్ డియాజ్-కెనల్ అని ఆయనన్నారు. చైనా-క్యూబా కమ్యూనిస్టు పార్టీలతో పాటు రెండు దేశాల మధ్య ప్రత్యేక మైత్రి ఉన్నదన్నారు. 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాతో దౌత్యపరమైన సంబంధాలను ఏర్పాటు చేసుకున్న పశ్చిమ అర్ధగోళం (వెస్టరన్ హెమీస్ఫియర్)లోని మొట్టమొదటి దేశం క్యూబా. మన సంబంధాలు సోషలిస్టు దేశాల మధ్య సంఘీభావానికి, సహకారాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పరస్పరం సహాయ సహకారాలకూ అద్దంపడుతున్నాయి' అని జిన్‌పింగ్ చెప్పారు. సీపీసీ జాతీయ మహాసభల్లో కీలక పరిణామాలను మిగుల్‌కు తెలిపారు. ఆధునికరణ పథంలో చైనీయులను నడిపించేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ కట్టుబడి ఉన్నదని, అన్ని రంగాల్లో ఆధునికరణ దిశగా ప్రజలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు ఏ విధంగా మారినాగానీ క్యూబాతో చైనా స్నేహబంధంలో మార్పు ఉండదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. సోషలిజం స్థాపనలో క్యూబాకు చైనా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని పరిరక్షించేందుకు, పెత్తందారీతనంపై పోరాటంలోనూ క్యూబాకు వెన్నుదన్నుగా ఉంటామని జిన్‌పింగ్ తెలిపారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంతో పాటు బాహ్య జోక్యాన్ని, ఆంక్షలను అడ్డుకునేందుకు కూడా అన్ని విధాలా మద్దతిస్తామని జిన్‌పింగ్ చెప్పారు. ప్రపంచాభివృద్ధి, భద్రత అమలుకు, ప్రపంచ శాంతి స్థాపనకు క్యూబాతో చైనా కలిసి పనిచేస్తుందన్నారు.

మలేసియా కొత్త ప్రధాని అన్వర్ ఇబ్రహీం

కూలాలంపూర్: మలేసియా నూతన ప్రధానమంత్రిగా సంస్కరణకర్త అన్వర్ ఇబ్రహీం ప్రమాణ స్వీకారం చేశారు. అవినీతి నిర్మూలనకు సంకల్పించారు. ఆర్థిక వ్యవస్థపై దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. ఇస్లాం అధికారిక మతంగా ఉండేందుకు కట్టుబడతానని చెప్పారు. సంప్రదాయ మాలేలకు ప్రత్యేక హక్కులు కల్పిస్తానని అన్వర్ తెలిపారు. ప్రజలు ఎప్పటినుంచో కోరకుంటున్న మార్పు ఎట్టకేలకు జరిగిందని ప్రమాణ స్వీకారం అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయనన్నారు. గతంలో అనేకసార్లు ప్రధాని అయ్యే అవకాశాన్ని ఆయన కోల్పోయారు.

1990 దశకంలో ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు. 2018లో ప్రధాని రేసులో ఉన్నారు. అవినీతి ఆరోపణలతో దాదాపు దశాబ్దం జైల్లో గడిపారు. తన రాజకీయ కెరీర్‌ను ముగించేందుకు కుట్ర జరిగిందని, తనపై కేసు రాజకీయ ప్రేరేపితమని అన్వర్ ఆరోపించారు.

నేపాలీ కాంగ్రెస్‌దే ఆధిక్యం

పూర్తి మెజారిటీ దిశగా అడుగులు

67స్థానాల్లో అధికార కూటమి గెలుపు

ఖాట్మండు: నేపాల్‌లో నేపాలీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సంకేతాలు ఉన్నాయి. ప్రధాని షేర్ బహదూర్ ద్యూబా... నేపాలీ కాంగ్రెస్ నేతృత్వంలోని అధికార కూటమికి స్పష్టమైన మెజారిటీ లభిస్తుందని శుక్రవారం వెలువడిన ఫలితాలు సూచించాయి. మొత్తం 124కుగాను 67 స్థానాలను అధికార కూటమి కైవసం చేసుకుంది. ప్రతినిధుల సభలో మొత్తం 275 మంది సభ్యులు ఉండగా వీరిలో 165 మందిని ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా మిగతా 110 మందిని దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. పూర్తి మెజారిటీ రావాలంటే మరో 138 స్థానాల అవసరం నేపాలీ కాంగ్రెస్‌కు ఉంది. ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా 42 స్థానాలను ఎన్సీ కైవసం చేసుకుంది. మిత్రపక్షాలు సీపీఎన్-మావోయిస్టు సెంటర్, సీపీఎన్-యూనిఫైడ్ సోషలిస్ట్ 12, 10 చొప్పున సీట్లు గెలుచుకున్నాయి. అధికార కూటమిలో భాగంగా ఉన్న లోకతాంత్రిక్ సమాజ్‌వాదీ రెండు స్థానాల్లో, రాష్ట్రీయ జనమోర్చా ఒక స్థానంతో సరిపెట్టుకున్నాయి. మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ నేతృత్వ సీపీఎన్-యూఎంఎల్ ఆధ్వర్యంలోని ప్రతిపక్ష కూటమి 38 స్థానాల్లో గెలిచింది. సీపీఎన్-యూఎంఎల్ 30 స్థానాలను కైవసం చేసుకుంది. విపక్ష కూటమిలోని రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ ఐదు స్థానాల్లో, జనతా సమాజ్ పార్టీ మూడు స్థానాల్లో గెలిచాయి. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఏడు సీట్లు దక్కించుకుంది. మాధేసీ పార్టీలైన లోకతంత్రై సమాజ్‌వాదీ పార్టీ, జన్మత్ పార్టీ రెండు, ఒకటి చొప్పున స్థానాల్లో గెలిచాయి. నాగరిక్ ఉన్‌ముక్తి పార్టీ రెండు స్థానాల్లో గెలవగా జనమోర్చా, నేపాల్ మజ్దూర్ కిసాన్ పార్టీ చెరొక స్థానం దక్కించుకున్నాయి. స్వతంత్రులు, ఇతరులు మరో ఐదు స్థానాల్లో గెలిచారు. ప్రతినిధుల సభ (హెచ్ఓఆర్), ఏడు ప్రావిన్షియల్ అసెంబ్లీలకు ఎన్నికలు ఆదివారం జరిగాయి. సోమవారం నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.

జీఎస్టీ వాటా పెంచాలి

పోలవరం సవరించిన అంచనాలు ఆమోదించాలి

మౌలిక సదుపాయాల కల్పన పీఎంఏవైలో చేర్చాలి

కేంద్ర ప్రీ-బడ్జెట్ సమావేశంలో మంత్రి బుగ్గన వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రాల ద్వారా 62 శాతం కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంటే, రాష్ట్రాలకు అదే 62 శాతం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉన్నందున జీఎస్టీ వాటా పెంచి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ వేదికగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో శుక్రవారం జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యతలు, అవసరాలను మంత్రి బుగ్గన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్య, వైద్యం, సామాన్య ప్రజలకు అండగా ఉండడం పైనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించినట్లు, దానికనుగుణంగా కేటాయింపులు కోరినట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలను ఆమోదించాలని కోరామన్నారు. మూలధన వ్యయం పై ఇచ్చే స్వల్పకాలిక రుణాలను వచ్చే ఏడాదికి కూడా పొడిగించాలన్న ప్రతిపాదనను, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ సుజల స్రవంతికి నిధులు ఇవ్వాలని కోరినట్లు మంత్రి వివరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గృహ నిర్మాణాలకు నిధులిస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర భాగస్వామ్యం లేనందున ఈ అంశాన్ని కూడా పీఎంఏవైలో చేర్చాలని సీతారామన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న పోలవరం, సుజల స్రవంతి, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సంబంధించి కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల, ఆసుపత్రిని రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడంలో కేంద్రం చొరవ తీసుకోవాలని. యువతకు ఉపాధి అందించే పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధిలో కేంద్రం మరింత సహకరించాలని కోరినట్లు మంత్రి బుగ్గన చెప్పారు.

400 రోజులు-4వేల కిలోమీటర్లు

(మొదటిపేజీ తరువాయి)

రికార్డును అధిగమిస్తూ సుమారు 4 వేల కిలోమీటర్లు కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని నియోజకవర్గాలను కలుపుతూ పాదయాత్ర చేపట్టేందుకు లోకేశ్ కార్యాచరణ రూపొందించారు. ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ నేతలతో భేటీ అయిన లోకేశ్ వారితో ఈ విషయాన్ని స్వయంగా ధృవీకరించారు. జనవరి 27 నుంచి పాదయాత్ర ప్రారంభించే అవకాశం ఉందని వెల్లడించారు. దాదాపు 400 రోజులపాటు యాత్ర కొనసాగుతుందని, తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిలో నాలుగు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల్లో మంగళగిరిలో గెలిచేందుకు సీఎం జగన్ అనేక అస్త్రాలు సంధిస్తారని, వాటన్నింటిని తిప్పికొట్టాలని వారికి సూచించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, మంగళగిరి నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతానని వారికి హామీ ఇచ్చారు. ఇకపై మంగళగిరి బాధ్యతలు కార్యకర్తలే తీసుకోవాలని కోరారు.

'ఎమ్మెల్యేలకు ఎర'... మరో ఐదుగురికి నోటీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మరో ఐదుగురికి సిట్ నోటీసులు జారీ చేసింది. కేరళ వైద్యుడు జగ్గుస్వామి సోదరుడు మణిలాల్‌తోపాటు సిబ్బంది శరత్, ప్రశాంత్, విమల్, ప్రతాపన్‌కు నోటీసులు ఇచ్చింది. 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసింది. ఈసారి కూడా విచారణకు హాజరు కాకుంటే అరెస్ట్ చేస్తామని హెచ్చరించింది. మరోవైపు సిట్ విచారణ వేగంగా సాగుతోంది. నంద కుమార్ భార్య చిత్రలేఖ, న్యాయవాదులు ప్రతాప్ గౌడ్, శ్రీనివాస్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే అరెస్ట్ అయిన నిందితులతో సంబంధాలపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రతాప్ గౌడ్, నందకుమార్ బ్యాంక్ ఖాతాలు, లావాదేవీలపై కూపీ లాగుతున్నారు.

కేజ్రీవాల్ హత్యకు బీజేపీ కుట్ర: ఆప్

న్యూదిల్లీ : దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) ఎన్నికల కోసం తీవ్ర ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తమ పార్టీ కన్వీనర్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆప్ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా శుక్రవారం ఆరోపించారు. అయితే సిసోడియా పాత కథనమే చదువుతున్నారని కాషాయ పార్టీ ఖండించింది. కాగా బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ వ్యాఖ్యల పై సిసోడియా మండిపడ్డారు. అతని భాష 'కేజ్రీవాల్‌ను హత్య చేయడానికి పన్నిన కుట్రకు ద్రోహం చేస్తుంది', అతనిని దర్యాప్తు చేయాలని కూడా అన్నారు. డిసెంబర్ 4న జరగనున్న ఎంసీడీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య త్రిముఖ పోటీగా భావిస్తున్నారు. కేజ్రీవాల్ ప్రాణాలకు ముప్పు ఉందని సిసోడియా చేసిన కొన్ని పాత ట్వీట్‌లను చూపుతూ, తివారీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'కేజ్రీవాల్‌కు హత్య బెదిరింపు అని అతను ప్రతి సంవత్సరం ఇలా చేస్తాడు. సిసోడియాను అరెస్టు చేస్తారని కేజ్రీవాల్ చెప్పడం, కేజ్రీవాల్‌ను హత్య చేస్తారని సిసోడియా స్వయంగా జోస్యం చెప్పడంతో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. ఆప్ నేత సందీప్ భరద్వాజ్ మరణాన్ని ఉదహరిస్తూ, ఇది ఆత్మహత్య కాదని, హత్య అని ఆరోపించారు. కేజ్రీవాల్‌తో సహా ఆప్ అగ్ర నాయకత్వమే దీనికి కారణమని తివారీ అన్నారు. 55 ఏళ్ల భరద్వాజ్ గురువారం పశ్చిమ దిల్లీలోని రాజౌరీ గార్డెన్‌లోని తన నివాసంలో ఉరివేసుకుని కనిపించాడు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఎంసీడీ ఎన్నికలకు ఆప్ నుంచి టికెట్టు ఇస్తామని భరద్వాజ్‌కు హామీ ఇచ్చారని, కానీ తర్వాత మరొకరికి అమ్మేసారని, దీంతో అతని జీవితం ముగిసిపోయిందని తివారీ ఆరోపించారు. కేజ్రీవాల్ భద్రతపై తాను ఆందోళన చెందుతున్నట్లు బీజేపీ నాయకుడు పునరుద్ఘాటించారు. మునిసిపల్ ఎన్నికలకు టికెట్లు అమ్ముకున్నందుకు ఆప్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలను వారి మద్దతుదారులు కొట్టి చంపుతున్నారని తివారీ గురువారం దుయ్యబట్టారు. 'నేను కేజ్రీవాల్ భద్రత గురించి ఆందోళన చెందుతున్నాను. ఎందుకంటే, ఆప్ వాలంటీర్లు నిరంతర అవినీతి, టికెట్ల అమ్మకం, రేపిస్ట్‌తో స్నేహం, జైలులో మసాజ్ చేయడం పై ప్రజలు కోపంగా ఉన్నారు. వారు తమ ఎమ్మెల్యేలను కూడా కొట్టారు. దిల్లీ ముఖ్యమంత్రి విషయంలో అలా జరగకూడదు...' అని ఎంపీ గురువారం ట్వీట్ చేశారు. తివారీ వ్యాఖ్యలను ఉటంకిస్తూ, సిసోడియా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అతని భాష 'కేజ్రీవాల్‌ను హత్య చేయడానికి పన్నుతున్న కుట్రకు ద్రోహం చేస్తుంది' అని బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ హత్యకు జరిగిన కుట్రను ఛేదించేందుకు విచారణ జరగాలని, గురువారం కూడా బీజేపీ, తివారీ పై అదే ఆరోపణలు చేసిన సిసోడియా అన్నారు.

'ఇలాంటి చిల్లర రాజకీయాలకు ఆప్ భయపడదు' అని ఆయన నొక్కిచెప్పారు. 'ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను చంపుతానని బహిరంగంగా బెదిరించిన బీజేపీ ఎంపీ తివారీని వెంటనే అరెస్టు చేయాలి. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఆయన అన్నారు. 'ఈ కుట్ర గురించి మొత్తం సమాచారాన్ని పొందడానికి అతనిని విచారణ చేయాలి' అని దిల్లీ ఉప ముఖ్యమంత్రి అన్నారు. కేజ్రీవాల్ రాజకీయాలు సుపరిపాలనపై ఆధారపడి ఉన్నాయని, దానికి ప్రజల విశ్వాసం ఉందని, ఆయన్ను చంపేందుకు కుట్ర పన్నడం ద్వారా 'అన్ని హద్దులు దాటేందుకు' బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. 'బీజేపీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు. కేజ్రీవాల్‌ను చంపేస్తామని వారి బహిరంగ బెదిరింపులకు ఆ పార్టీ అధికారం కోసం ఎంతటికైనా వెళ్లగలదని చూపిస్తోంది' అని సిసోడియా అన్నారు. బీజేపీ, ఆప్ మాటల యుద్ధం నడుమ... దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా కార్యాలయ వర్గాల ప్రకారం... సంబంధిత పరిణామాలపై నిఘా ఉంచాలని, ఏదైనా సంఘటన జరగకుండా చూడాలని దిల్లీ పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. ఇదిలాఉండగా, కేజ్రీవాల్‌ను హత్య చేసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఫిర్యాదు చేసేందుకు దిల్లీ ఎన్నికల కమిషనర్‌ను ఒక ప్రతినిధి బృందం కలుస్తుందని ఆప్ ముఖ్య అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే సౌరభ్ భరద్వాజ్ తెలిపారు. గతంలో కూడా దిల్లీ పోలీసు సిబ్బంది సమక్షంలోనే కేజ్రీవాల్‌పై దాడులు జరిగాయని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆ తర్వాత, ఆప్ కేజ్రీవాల్‌కు ప్రాణహాని ఉందంటూ బీజేపీ ఎంపీ తివారీ, ఇతర నేతల పై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

అమ్మేసేందుకే ఆరాటం!

ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్ కోసం వెతుకలాట

ఫలహారంగా ప్రభుత్వరంగ సంస్థల ఆస్తులు

పీఎస్‌యూల్లో చిన్న వాటాల విక్రయానికి యోచన

లక్ష్యం చేరకుంటే బడ్జెట్‌లో కోతేనంటూ హెచ్చరిక

న్యూదిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మేసేందుకు ఆరాటపడుతోంది. ప్రధాని మోదీ ప్రభుత్వం అనాలోచిత ఆర్థిక విధానాలతో దేశాన్ని ఆర్థికంగా గడ్డు పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ నేపథ్యంలో గత ఎనిమిదేళ్లలో డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి రూ.3.3 లక్షల కోట్లను సమకూర్చిన పీఎస్‌యూలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ఆస్తుల నుంచి అదనపు ఆదాయ మార్గాలేమైనా (మానిటైజేషన్) ఉన్నాయో పరిశీలించాలని ఆయా మంత్రిత్వ శాఖలకు తాజాగా సూచించింది. ఈ విషయాన్ని ఒక ఆంగ్ల దినపత్రిక వెల్లడించింది. మానిటైజ్ లక్ష్యం చేరకుంటే బడ్జెట్‌లో కోతే అని మంత్రిత్వ శాఖలకు కేంద్రం హెచ్చరికలు చేసింది. ఈ ఏడాది మానిటైజ్ లక్ష్యానికి దూరంగా కనీసం 20 శాతానికి చేరుకోకపోవడంతో కార్పొరేట్ మిత్రులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థలను అతి తక్కువకు తెగనమ్మే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ముమ్మరం చేసింది.

కోల్ ఇండియా, హిందుస్థాన్ జింక్, రాష్ట్రీయ కెమికల్స్‌లో 5-10 శాతం వాటాల విక్రయం

ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రపంచంలోని అతిపెద్ద బొగ్గు గని, ఆసియాలో అతిపెద్ద జింక్ ఉత్పత్తిదారుతో సహా ప్రభుత్వరంగ సంస్థలలో చిన్న వాటాలను విక్రయించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలయిన కోల్ ఇండియా లిమిటెడ్, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్‌లలో 'అమ్మకానికి ప్రతిపాదన యంత్రాంగం'(ఆఫర్ ఫర్ సేల్ మెకానిజం' అని పిలవడే విధానం ద్వారా 5 నుంచి 10 శాతం వాటాలను విక్రయించాలని చూస్తోంది. అయితే అందుకు సంబంధించిన వివరాలను ఇంకా బహిరంగపర్చలేదు. రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని జాబితా సంస్థతో సహా మొత్తం ఐదు సంస్థలను ఎంపిక చేసుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్లూమ్‌బెర్గ్ లెక్కల ప్రకారం... ఇందుకు సంబంధించి ప్రస్తుత ధరల ప్రకారం, శ్రేణి దిగువ ముగింపులో విక్రయాలు ప్రభుత్వానికి దాదాపు రూ.16,500 కోట్లు పొందవచ్చు. భారతదేశం అటువంటి ఆస్తుల విక్రయాల నుంచి మార్చి వరకు సంవత్సరానికి రూ.65 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటి వరకు లక్ష్యంలో కేవలం మూడింట ఒక వంతు మాత్రమే సమీకరించింది. ప్రధానంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) మే నెలలో 2.7 బిలియన్ డాలర్ల ప్రారంభ పబ్లిక్ సమర్పణ నుంచి సముపార్జించుకుంది. వాటా విక్రయాలపై పెట్టుబడిదారుల ఆసక్తిని అంచనా వేయడానికి రోడ్ షోలు ప్రారంభమయ్యాయని ఆ వర్గాలు వివరించాయి. అయితే దీనిపై స్పందించేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతినిధిని అందుబాటులో లేరు. కోల్ ఇండియా గత సంవత్సరంలో దాదాపు 46 శాతం, రాష్ట్రీయ కెమికల్స్ 58 శాతం లాభపడ్డాయి.

లక్ష్యాన్ని చేరుకోవాల్సిందే...

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం ఆయా మంత్రిత్వ శాఖలకు సూచించింది. ఎన్ఎంపీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.1.6 లక్షల కోట్లను కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. గడిచిన 7 నెలల్లో రూ.33,443 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం మానిటైజ్ చేసింది. దీంతో మానిటైజేషన్ ప్రక్రియలో వెనుకబడిన రైల్వే, టెలికం, పెట్రోలియం తదితర శాఖల పై కేంద్రం అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆయా శాఖలకు కేంద్రం సూచించినట్టు ఆంగ్ల పత్రిక వివరించింది. మానిటైజేషన్ లక్ష్యాలను చేరుకోని శాఖలకు వచ్చే బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధించనున్నట్టు కేంద్రం హెచ్చరించినట్టు కూడా తెలుస్తున్నది. ఏడు నెలలు పూర్తయినప్పటికీ, ఈ ఏడాది మానిటైజేషన్ లక్ష్యాన్ని 20 శాతం కూడా చేరుకోకపోవడం పై కేంద్రం ఆయా శాఖల పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎన్ఎంపీ ద్వారా ఈ ఏడాది ఆస్తులను విక్రయించి రూ.1.24 లక్షల కోట్లను ఆర్జించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొన్నట్టు సమాచారం. అంటే రూ.1.6 లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.1.24 లక్షల కోట్లకే విక్రయించాలని కేంద్రం భావిస్తున్నట్టు అర్థమవుతున్నది. కాగా, రైల్వే, టెలికం శాఖలు మానిటైజేషన్ ప్రక్రియను వచ్చే ఏడాది వరకు వాయిదా వేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ ఏడాది మానిటైజేషన్ లక్ష్యాలను పరిశీలిస్తే... రైల్వే మంత్రిత్వ శాఖలో లక్ష్యం రూ.30 వేల కోట్లు కాగా ప్రస్తుత స్థితి రూ.4,999 కోట్లుగా ఉంది. ఇక టెలికంలో రూ.20,180 కోట్లకుగాను ప్రస్తుతం రూ.4,700 కోట్లుగా ఉంది. అలాగే పెట్రోలియం మంత్రిత్వ శాఖలో రూ.9,176 కోట్ల లక్ష్యంగా ఉండగా, ప్రస్తుత స్థితి రూ.2 వేల కోట్లుగా ఉంది.

రిషికొండలో పర్యావరణ విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

చేయవలసిన అవసరం లేదని, వేరేచోట ఎక్కడయినా వాటిని నిర్మించవచ్చని అభిప్రాయపడ్డారు. వీటి నిర్మాణానికి కోర్టు నుంచి అనుమతి తీసుకున్నామని అధికారులు చెప్పినట్లు తెలిపారు. రిషికొండ నిర్మాణాలను రహస్యంగా ఉంచడం వల్ల అపోహలు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న కారణంతో ఎవరినీ అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారన్నారు. ఆగస్టులో రిషికొండ పరిశీలనకు పోలీసులు అనుమతించలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. దీంతో కోర్టును ఆశ్రయించామని, ఆగస్టు 22న కోర్టు నుంచి అనుమతి వచ్చిందని చెప్పారు. అయినా అనుమతి ఇవ్వడంలో పర్యాటక శాఖ ఎండీ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని చెప్పారు. క్యూబా పర్యటన నుంచి తిరిగి వస్తుండగా ఫ్లోరిడాలో ఇమిగ్రేషన్ అధికారులు అడ్డగించిన విషయం టీవీల్లో స్క్రోలింగ్‌గా వచ్చిందని, దాన్ని చూసి ఉద్దేశపూర్వకంగా పర్యాటక శాఖ ఎండీ రిషికొండ పర్యటనకు రావాలని వాట్సప్ సందేశం పెట్టారని చెప్పారు. చివరికి కోర్టు ధిక్కరణ కేసు వేయడంతో రిషికొండ పరిశీలనకు అనుమతించారని చెప్పారు.

పాలనలో పారదర్శకత లేదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో పారదర్శకత లేదని విమర్శించారు. రుషికొండ డిఫెన్స్ పరిధిలోని ప్రాంతం కాదని, దాన్ని పరిశీలించడానికి ప్రభుత్వం నిరాకరించడాన్ని చూస్తుంటే ఏదో దాచిపెడుతుందన్న విషయం అర్థమవుతోందని అన్నారు. జగన్ పరదా ముఖ్యమంత్రిగా మారిపోయారని, ఆయన పర్యటిస్తున్న ప్రాంతాల్లో వేలాదిమంది పోలీసులను మోహరిస్తున్నారని, రహదారులకు రెండు వైపులా పరదాలు కడుతున్నారని, దుకాణాలను మూసి వేయిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎక్కడికి వెళుతున్నా పోలీసులతో అడ్డుకుంటున్నారని చెప్పారు. పోలీసులకు ఈ పని తప్ప వేరే పని లేకుండా పోయిందని ధ్వజమెత్తారు.

ప్రభుత్వ నిర్బంధం అప్రజాస్వామికం : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కొత్త రిసార్టుల నిర్మాణం పేరుతో రుషికొండని తొలిచివేస్తున్నారని విమర్శించారు. రుషికొండ పరిశీలన విషయంలో ప్రభుత్వ నిర్బంధం అప్రజాస్వామికమని విమర్శించారు.

ప్రాణాలు పోయినా

భూములు వదులుకోం

డిజైన్ మార్చండి లేదా భూమికి భూమి ఇవ్వండి

పోలవరం ఎడమ కాలువ నిర్వాసిత రైతుల గ్రామసభ రసాభాస

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విజయనగరం జిల్లా ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టు (బాబు జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి) ఎడమ కాలువ ఏర్పాటుకు శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర అధ్యక్షతన నిర్వాసిత రైతులతో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ఎస్.కోటకు సంబంధించి పోలవరం ఎడమ కాలువకు సుమారు152 ఎకరాల భూమి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలువ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితిల్లో భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కాలువ అలైన్‌మెంట్ మార్చడం, నష్టపోయిన భూమికి బదులు భూమిని ఇచ్చేలా తీర్మానం చేయాలని రైతులు పట్టుబట్టారు. పోలవరం పర్స్ట్ డీఈఈ లక్ష్మీసుధ మాట్లాడిన తీరుపై రైతులు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటరమణపేట నుంచి చిలకలగెడ్డ వయా తాటిపూడికి డిజైన్ మార్చాలని, అలా చేస్తే చాలా తక్కువ ఖర్చుతో ఎడమ కాలువ ఏర్పాటు చేయవచ్చని సూచించారు. అసలు తమకు తెలియజేయకుండా తమ భూముల్లో హద్దు రాళ్లు ఎలా పాతారంటూ నిలదీశారు. ఎస్.కోట ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా పలుకుతాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఎకరా రూ.45 లక్షలకు ఎలా ఒప్పుకుంటామని ప్రశ్నించారు. తమ భూముల్లో అనుమతి లేకుండా అధికారులు కొలతలు తీస్తుంటే అడ్డుకున్న తమపై పోలీసు కేసులు పెడతామని హెచ్చరించడం ఏంటని ధ్వజమెత్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువ తవ్వేందుకు అనుమతించబోమని రైతులు తేల్చి చెప్పారు. డిజైన్ అయినా మార్చండి లేదా పోయిన భూమికి సమానంగా వేరొక చోట భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ భూములు పోతే 300 కుటుంబాలు గ్రామం వీడి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ప్రాణాలు పోయినా భూములు వదులుకోమని రైతులు వెల్లడించారు. గ్రామ పరిధిలో అంతా చిన్న సన్నకారు రైతులేననీ ఆవేదన వ్యక్తం చేశారు. బడాబాబుల భూములు తప్పించి తమ భూమి లాక్కుంటామంటే బతుకులు ఏం కావాలని గగ్గోలు పెట్టారు. తమ డిమాండ్లకు తలొగ్గితేనే ఒప్పుకుంటామనీ, లేకుంటే అధికారులతో తెల్చుకుంటామంటూ రైతులు రైతులు నానిగిరి రమనాజీ, వసంత సత్యారావు, నౌదాసరి సత్తిబాబు, చాకలి రమణ, కొటాన సన్ని, పొలమరశెట్టి రామకృష్ణ, పోలవరం నిర్వాసిత ప్రజా పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తదితరులు హెచ్చరించారు.

సుదర్శన దొర మాట్లాడుతూ, ఎకరాకు రూ.45 లక్షలు, భూమిలో ఉన్న చెట్లకు, భవనాలకు కూడా వేర్వేరుగా పరిహారం చెల్లిస్తారని, మీ అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినా రైతులు అంగీకరించలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బయటకు వెళ్లిపోయారు. ఇకమీదట ఏర్పాటు చేసే సభలకు రాబోమని ప్రకటించారు.

అలైన్‌మెంట్ మార్చాల్సిందే: సీపీఐ

రైతుల అంగీకారం లేకుండా వారి భూముల్లో కొలతలు తీసి హద్దు రాళ్లు ఎలా పాతారంటూ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ఏపీ రైతు సంఘం నాయకుడు దేగల అప్పలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ, మండల కార్యదర్శి మోపాద మధు, నాయకులు షేక్ స్వామి అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల డిమాండ్ల మేరకు అలైన్‌మెంట్ మార్చడం లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, జేఈలు కీర్తి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన దిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు దార దత్తం చేయడంతో పాటు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ నిరసనకు సీపీఐ జాతీయ కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకుడు వినయ్ విశ్వం, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య సంఘీభావం తెలిపారు.

రాష్ట్రం నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, వైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు ఎం.సుబ్బారావు, జి.సంతోష్ కుమార్, జి.నాగరాముడు,షేక్ సుభాని, యు.కారుమంచి, వై.బాబి, మొజ్జాడ యుగంధర్, గంగా సురేష్, కత్తి రవి, ఎంవీ సుబ్బారావు, ఎం.సాయికుమార్, శ్రీరాములు, నాసర్‌జీ, మస్తాన్, ఫణీంద్ర, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వివక్షాపూరితం

(మొదటిపేజీ తరువాయి)

తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి వీరిని బదిలీ చేయించిందని ఆరోపించారు. ఇవి సాధారణ బదిలీలు కాదని అందరికీ అర్థమవుతుందన్నారు. ఇటువంటి అకారణ బదిలీలు చేయటం ద్వారా ఇతర జడ్జిలను బెదిరిస్తున్నట్లుందని ఇది సమాజ హితవు కాదన్నారు. సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయానికి నిరసనగా, దీనిని ఉపసంహరించుకునే వరకు విధులు బహిష్కరించాలని బార్ అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్లు శ్రావణ్ కుమార్ వెల్లడించారు. కాగా జడ్జిల బదిలీలను రాజకీయం చేయడం తగదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై బురద చల్లడం సరికాదని హైకోర్టు న్యాయవాది వరప్రసాద్ అన్నారు. న్యాయమూర్తులకు కులాలు అంటగట్టడం దురదృష్టకరమని, ఇకనైనా టీడీపీ అనుకూల న్యాయవాదులు ఇటువంటి రాజకీయాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

చిట్‌ఫండ్ ఖాతాదారులకు రామోజీ అన్యాయం: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బ్యాం కులో జమ చేయాల్సిన డబ్బును దారి మళ్లిస్తూ... మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారు లకు రామోజీ రావు అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చిట్‌ఫండ్ సభ్యులకు ముప్పు కలిగించేలా ఆయన వ్యవహారాలున్నాయని, రూ.వేలాది కోట్ల సొమ్ము చట్ట విరుద్ధంగా దారి మళ్లిస్తున్నారనీ, వాటి అన్నింటికీ ఆధారాలున్నాయని చెప్పారు. రామోజీ అక్రమాలకు చంద్రబాబే రక్షకులనీ, మార్గదర్శి అక్రమాలను ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలనడం తగదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని ఇప్పటం అంశంలో రామోజీ, చంద్రబాబు, పవన్ కళ్యాన్ అభాసుపాలయ్యారని మండిపడ్డారు. చిట్‌ఫండ్ వ్యాపారం చేయవచ్చుగానీ, అది చట్టబద్ధంగానే ఉండాలని సూచించారు. ఇటీవల రిజిస్ట్రార్ కార్యా లయ అధికారులు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో చట్టవ్యతిరేకంగా వ్యాపారం చేస్తున్నాడని, చిట్‌ఫండ్ యాక్టును రామోజీరావు దుర్వినియోగం చేస్తున్నాడనేది తేటతెల్లమైందన్నారు. మార్గదర్శి నుంచి వేల కోట్ల రూపాయల నిధులను ఇతర సంస్థలకు మళ్లిస్తున్నారని విమర్శించారు.

భారత రాజ్యాంగం సజీవ పత్రం

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

ఏఎన్‌యూలో ఘనంగా 73వ రాజ్యాంగ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మారుతున్న సమాజం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సవరణలకు పూర్తి అనుకూలంగా ఉన్న భారత రాజ్యాంగం సజీవ పత్రంగా ప్రపంచ రాజ్యాంగ మేధావుల పిలుపును అందుకుంటుందని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. 73వ రాజ్యాంగ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం నాగార్జున విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో బి.ఆర్. అంబేద్కర్ చైర్, న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన అంబేద్కర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిసోడియా కీలకోపన్యాసం చేశారు. 'భారత రాజ్యాంగం -తత్వశాస్త్రం' అనే అంశంపై సిసోడియా మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని రూపొందించడానికి నాడు చేసిన ప్రయత్నాలు ప్రజలకు తెలియనప్పటికీ, నేడు వారి జీవన గమనం సజావుగా సాగుతున్నందున రాజ్యాంగాన్ని సాధారణంగా తీసుకుంటున్నారన్నారు. భారతదేశంతో పాటు పొరుగు దేశాన్ని ఉదాహరణగా పేర్కొంటూ, వారు తొమ్మిదేళ్ల తర్వాత మాత్రమే తమ రాజ్యాంగాన్ని తీసుకురాగలిగారని, మనం స్వాతంత్ర్యం వచ్చిన మూడేళ్లలోపే భారత రాజ్యాంగాన్ని ఆమోదింప చేసుకున్నామని గుర్తు చేశారు. మనం అనుభవిస్తున్న అధికారానికి మన రాజ్యాంగమే మూలమని, వసుదైక కుటుంబం, సత్యమేవ జయతే, సర్వజన హితయ, సర్వజన సుఖాయ వంటి మన ప్రాచీన సూత్రాల ప్రకారం రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులకు హామీ ఇస్తుందని సిసోడియా అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మనకు బాగా సరిపోతుందన్నారు. స్థిరమైన ప్రభుత్వాలు కొనసాగేలా రాజ్యాంగం స్పష్టత నిచ్చిందని, ఫలితంగానే ప్రపంచంలో భారత దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కూడా అవతరించిందన్నారు. ఫెడరలిజం అనేది రాజ్యాంగ తత్వశాస్త్రం, ఆత్మ వంటిదన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ తత్వవేత్తగా నిలిచిన ఆచార్య నాగార్జున ఖ్యాతిని కొనసాగించాలని సిసోడియా విద్యార్థులకు ఉద్బోధించారు. ఉప కులపతి ఆచార్య పి.రాజ శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, అంబేద్కర్ చైర్ నుంచి ఆచార్య వై అశోక్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూప్ రాణి పాల్గొన్నారు.

నేడు నింగిలోకి పీఎస్‌ఎల్వీ-సీ54

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: పీఎస్‌ఎల్వీ-సీ54 ప్రయోగానికి కౌంట్ డౌన్ మొదలైంది. శ్రీహరికోటలోని సతీశ్ అంతరిక్ష కేంద్రంలోగల మొదటి ప్రయోగవేదిక నుంచి శనివారం రాకెట్ ప్రయోగానికి భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఏర్పాట్లు చేసింది. ఉదయం 11.56గంటలకు పీఎస్‌ఎల్‌వీ-సీ54 నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ రాకెట్ ద్వారా ఓషియన్‌శాట్-3తో పాటు ఇస్రో, భూటాన్ సంయుక్తంగా తయారుచేసిన ఉపగ్రహం, మరో నాలుగు వాణిజ్య ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్నారు. భారతీయ భూ పరిశీలన ఉపగ్రహం ఈవోఎస్ జీరో-6ను 17.21 నిమిషాల్లో భూమికి 743 కిలోమీటర్ల సూర్య అన్నువర్తన ధ్రువకక్షలోకి ప్రవేశపెడతారు. ఆపై రాకెట్ నాల్గవ దశను నియంత్రించి ఎనిమిది సూక్ష్మ ఉపగ్రహాలను వేరే కక్షలోకి ప్రవేశపెడతారు. మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి 2.15గంటలు పడుతుంది. అంతరిక్షం నుంచి సముద్రగర్భంలోని చేపల గురించి తెలుసుకోవడానికి ఈ ఉపగ్రహాలు ఉపయోగపడతాయి. దేశీయంగా తయారు చేసిన రెండు ఓషియన్‌శాట్ ఉపగ్రహాలను భారత్ ఇంతకుముందే ప్రయోగించింది. ఈ ఉపగ్రహం ఐదేళ్లపాటు సేవలందిస్తుంది. తాజా ప్రయోగం విజయవంత మైతే దేశంలోని మత్స్యకారులకు ప్రయోజనం ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. పీఎస్‌ఎల్‌వీ సీ54 ప్రయోగం కోసం షార్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్ర మార్గం గుండా చొరబాట్ల నివారణకు సీఐఎస్‌ఎఫ్ బలగాలను మోహరించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల

విశాలాంధ్ర-గుంటూరు: సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం బృందాలు జగనన్న కాలనీల సందర్శన చేపట్టాయి. గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాంలోని క్వారీల వద్ద జగనన్న కాలనీని శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు తమ బృందంతో సందర్శించారు. పునాదులకే పరిమితమైన ఇళ్లను చూసి చలించిపోయారు. అంతా అవకతవకలమయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సాయం సరిపోకా... అదనపు భారాన్ని భరించలేక... ఇళ్లు కట్టుకోలేక తీవ్ర ఆవేదనకు గురౌతున్న లబ్ధిదారులను పలుకరించారు. సీపీఐ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మీ పక్షాన సీపీఐ ఆందోళన చేపడుతుందని స్పష్టం చేశారు. అనంతరం జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 లక్షల ఇళ్లు ఇచ్చామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాటి నిర్మాణంలో మాత్రం ప్రజలకు చుక్కలు చూపుతుందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలం సరిపోదని, పట్టణాల్లో సెంటున్నర, గ్రామాల్లో ముడున్నర సెంట్లు ఇవ్వాలని మొదటి నుంచి సీపీఐ పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. అయితే పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర ఇచ్చిందని అన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ఇంటి నిర్మాణం ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలలో జరుగదని స్పష్టం చేశారు. పునాదులకే పరిమితమైన ఇళ్లను చూసి ఎప్పటికి ఇళ్లు పూర్తి చేసుకుంటారంటే చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో డిసెంబర్ 5న మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్‌రావు, నియోజకవర్గ నాయకులు జీవీ రాజు, గుర్రంకొండ సత్యానందం, మరియదాసు పాల్గొన్నారు.

కనీస మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు

'ఏపీ సీఎం ఎంఎస్' యాప్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నగరాలు, పట్టణాల్లో కనీస మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ, సమస్యల సత్వర పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీర్ఘకాలంలో నిర్మాణాత్మక వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనికోసం పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నది. 'ఏపీ సీఎం ఎంఎస్' (ఏపీ కన్‌సిస్టెంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్) యాప్‌తో రియల్‌టైం మానిటరింగ్ చేయనున్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సీఎం జగన్ శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో ఈ యాప్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. రోడ్లపై గుంతలు, రోడ్లకు మరమ్మతులు, పచ్చదనం, సుందరీకరణ, వీధిలైట్ల నిర్వహణ, ఫుట్‌పాలు, మురుగు కాల్వల్లో పూడికతీత, భూగర్భ మురుగునీటి వ్యవస్థల నిర్వహణ, పబ్లిక్ టాయ్‌లెట్ల ఏర్పాటు, వాటి నిర్వహణ, ట్రాఫిక్ జంక్షన్లు, వాటి నిర్వహణ అంశాలపై యాప్ ద్వారా రియల్ టైం మానిటరింగ్ చేయనున్నారు. రాష్ట్రంలో 4,119 వార్డు సచివాలయాల పరిధిలో ఈ మౌలికసదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. వార్డు సెక్రటరీలు తమ పరిధిలో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ తనిఖీలు నిర్వహిస్తారు. సుమారు ఆరేడు కిలోమీటర్ల మేం˘రోడ్లపై నిరంతర పర్యవేక్షణతోపాటు, పైన పేర్కొన్న వాటిపై నిరంతర తనిఖీలు, ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే ఫొటో తీసి యాప్ ద్వారా అప్‌లోడ్, గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళతారు. పౌరులకూ ఫోటోలు అప్‌లోడ్ చేసే అవకాశం కల్పిస్తారు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా తమ దృష్టికి వచ్చిన అంశాలను యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు సమస్యలు సంబంధిత విభాగాలకు పంపి పరిష్కారాలు లభించేలా చూస్తారు. సీఎం జగన్ మాట్లాడుతూ, మున్సిపల్ సర్వీసుల కోసం నగరాలు, పట్టణాల్లో తీసుకు వస్తున్న యాప్‌ను గ్రామాల్లో కూడా అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. రాజమండ్రిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు నిర్మాణ ప్రతిపాదనకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 28 అర్బన్ లోకల్ బాడీస్‌ను కవర్ చేస్తూ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని, 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఇది నిర్మాణమవుతుందని సీఎం చెప్పారు. మంత్రి ఆదిమూలపు సురేష్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్. గుల్జార్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ పాల్గొన్నారు.

రేపు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మహాజన సభ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 27న ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ (ఏపీజీడబ్ల్యూఎస్‌ఈడబ్ల్యూ) రాష్ట్ర ప్రథమ మహాజనసభ నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నేత వి.అర్లయ్య వెల్లడించారు. విజయవాడ ఏపీ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం యూనియన్ నేతలు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉదయం 9 గంటలకు లెనిన్ సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు. మహాజన సభకు 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తరలి రానున్నారని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై చర్చిస్తామన్నారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, జోగి రమేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు. ప్రతి ఉద్యోగి తరలివచ్చి ఐక్యతను చాటాలని కోరారు. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ వైవీ రావు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు, కృష్ణా, గుంటూరు జిల్లాల చైర్మన్లు ఈశ్వర్, సంగీతరావు, వివిధ జిల్లాల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు గోవిందరావు, షామీర్ హుస్సేన్, జ్యోతి, జగదీష్, దుర్గారావు, మోహన్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా-విభజన హామీల సాధనకు

కేంద్రంపై పోరాడాలి

పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక హోదా సాధన సమితి డిమాండు

విశాలాంధ్ర - ఏలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక హోదా సాధన సమితి డిమాండ్ చేసింది. వీటిని సాధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం హామీల గురించి మరిచిందని విమర్శించింది. తక్షణమే వాటి సాధన కోసం కేంద్రంపై పోరాటం చేయాలని లేని పక్షంలో ప్రజలకు క్షమాపణలు చెప్పి గద్దె దిగాలని సూచించింది. శుక్రవారం దిల్లీలో విద్యార్థి-వయోజనుల ధర్నాకు మద్దతుగా ఏలూరు పాత బస్టాండు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొంది. సమితి కార్యదర్శి డేగా ప్రభాగర్ అధ్యక్షతన ఆర్ఆర్ పేట, స్ఫూర్తిభవన్‌లో జరిగిన సమావేశంలో డేగా ప్రభాకర్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మనవకృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పళ్ళెం కిషోర్ మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధనతో పాటు అనేక అంశాలపై వామపక్షాలు నిరంతరం పోరాడుతూనే ఉన్నారని గుర్తుచేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా, ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల ప్రతిభా విద్యార్థులకు పతకాలు

మంత్రి మేరుగు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ గురుకులాల్లో చదువులోను, క్రీడల్లోను ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు తరగతుల వారీగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో రాబోయే జనవరి 3 నుంచి ఈ పతకాలను విద్యార్థులకు అందించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ గురుకులాల్లో విద్యార్థుల ప్రతిభాపాటవాలను మరింతగా మెరుగులుదిద్దడానికి, పోటీతత్వాన్ని పెంపొందించడానికి మెడళ్ల పథకాన్ని తీసుకొస్తున్నామన్నారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు... సాధారణ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగాను, 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు వారంతపు పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగాను ఈ పతకాలను అందజేస్తామని పేర్కొన్నారు. విద్యా విభాగంలో మూడు పతకాలు, క్రీడలు ఇతర విభాగాల్లో మూడు చొప్పున ప్రతి తరగతికీ రెండు స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలను వారి తరగతి టీచర్ల ద్వారా అందిస్తామన్నారు.

పుస్తక పఠనంతో రుగ్మతలు దూరం

- బుక్స్ క్లబ్‌కు విశాలాంధ్ర కృషి చేయాలి
- డొక్కా మాణిక్యవరప్రసాద్

సభలో ప్రసంగిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ పక్కన జంగాల అజయ్‌కుమార్, కోయ సుబ్బారావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, మనోహర్ నాయుడు, వల్లూరు శివప్రసాద్, ఏస్తెరు సునీత

విశాలాంధ్ర-గుంటూరు : సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు పుస్తక పఠనం దోహదపడుతుందని మాజీ మంత్రి, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో విశాలాంధ్ర బుక్ హౌస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 22వ గుంటూరు పుస్తక మహోత్సవాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలో కలియ తిరిగి పుస్తకాలను పరిశీలించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే జ్ఞానసముపార్జన సాధ్యమన్నారు. బాల సాహిత్యం నుంచి భారతం వరకు, ఫిక్షన్ నుంచి ఫిలాసఫీ వరకు సాహిత్యం నుంచి ఆధ్యాత్మికం వరకు వేలాది రకాల పుస్తకాలు ఒకే వేదికపై లభించడం అభినందనీయమన్నారు. సాహిత్య విస్తరణలో విశాలాంధ్ర కృషి అద్వితీయమని, అదేవిధంగా బుక్స్ క్లబ్ ఏర్పాటుకు విశాలాంధ్ర కృషి చేయాలని కోరారు. ముఖ్యఅతిథిగా హాజరైన కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనం దోహదపడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాలాంధ్ర విజ్ఞాన గని అని, ఇది సాహిత్య, సాంస్కృతిక వికాసానికి కృషి చేస్తుందని చెప్పారు. నేటితరానికి సాహిత్యంపై అవగాహన కల్పించాలని, ఇది ఒక ఉద్యమంలా జరగాలని ఆకాంక్షించారు. 'చిరిగిన చొక్కా అయిన తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్న మహనీయుల మాటలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరికి ఒక పుస్తకం, ప్రతి పుస్తకానికి ఒక పాఠకుడు ఉంటాడని చెప్పారు. అరసం, విశాలాంధ్ర ప్రచురణ సంస్థలు ఆవిర్భావం నాటి నుంచి సాహిత్య, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ పుస్తకాలు మనిషిని మహోన్నతుడిని చేస్తాయ న్నారు. ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఏస్తేరు సునీత మాట్లాడుతూ నేడు టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినప్పటికీ పుస్తకం పాత్ర మాత్రం అలానే ఉందన్నారు. ఒక మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమన్నారు. నేటితరం పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, దీనికి తల్లి దండ్రులు, ఉపాధ్యా యులు కృషి చేయాలని కోరారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్ ఆలోచింపచేసే గేయాలు ఆలపించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎంఆర్ ఆనంద్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, విశాలాంధ్ర బుక్ హౌస్ గుంటూరు మేనేజర్ ఎం. మల్లిఖార్జునరావు, సిబ్బంది పీటర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లన్న ఆదాయం రూ.30.89 కోట్లు

విశాలాంధ్ర-శ్రీశైలం: నంద్యాల జిల్లా శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయానికి గతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ సేవల రూపంలో రూ.30,89,27,503 ఆదాయం వచ్చిందని ఈఓ లవన్న తెలిపారు. గత ఏడాది కార్తీక మాసంలో రూ. 19,86,53,778 రాగా, ఈ ఏడాది రూ. 11,02,73,725 అధికంగా వచ్చిందన్నారు. గత ఏడాది కంటే 55.51 శాతం రాబడి పెరిగినట్లు ఆయన వివరించారు. సాధారణ జమల ద్వారా రూ. 19.95,73,883, హుండీ ద్వారా రూ. 6,73,79, 922, 'అన్నప్రసాదం' విరాళం ద్వారా రూ. 94,04,979, ఇటీవల ప్రవేశపెట్టిన ఉదయాస్తమాన సేవల ద్వారా రూ. 8,08,928, ప్రదోష సేవలు రూ. 22,35,324 ఆదాయం లభించిందన్నారు. అభిషేకాల ద్వారా రూ. 2,22,56,210, కుంకుమార్చన రూ.62,88,712, ఇతర ఆర్జిత సేవల ద్వారా రూ.94,42, 942 రాబడి వచ్చిందన్నారు.

చివరి పైసా వచ్చే వరకూ పోరు: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చాట్రాయి: దళారీ చేతిలో మోసపోయిన ప్రతీ రైతుకు చివరి పైసా వచ్చే వరకూ పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఏలూరు జిల్లా చాట్రాయి మండలం, చనుబండలో రైతులను కలిసి, వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చనుబండ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొన్నేళ్లుగా తిరువూరు మండలం మల్లేలకు చెందిన వ్యక్తి బాధ్యతలు నిర్వర్తించేవాడు. గత దాళ్వా సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో చనుబండ రైతులు ఆ వ్యక్తిని నమ్మి ధాన్యం, మొక్కజొన్నలు విక్రయించారు. ఏడు నెలలు గడుస్తున్నా తమకు డబ్బు అందకపోవడంతో రైతుల్లో ఆందోళన ఎక్కువైంది. ఈ విషయాన్ని వారంతా పత్రికా ముఖంగా వెల్లడించారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల బృందం శుక్రవారం గ్రామానికి వచ్చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంఘం నాయకులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్న బాధిత రైతులు చనుబండ సభాస్థలి వద్దకు చేరకున్నారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కష్టించి పనిచేసిన రెక్కల కష్టాన్ని చివరి పైసా ఇచ్చే వరకూ పోరాడదామని పిలుపునిచ్చారు. రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారనీ, దీని వెనుక భారీ స్కాం ఉందేమోనన్న అనుమానాలున్నాయన్నారు. అన్నదాతలంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జమలయ్య మాట్లాడుతూ గత రబీ సీజన్‌లోనే ప్రభుత్వం ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే రైతులు తమ ధాన్యాన్ని దళారీలకు విక్రయించే వారు కాదన్నారు. ప్రభుత్వం చేసే దానికి, చెప్పే దానికి పొంతన ఉండటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతులు మోసపోయారన్నారు. ఈ విషయాలు పత్రికల్లో వస్తే పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ కథనాలను సుమోటోగా ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ కందుల కృష్ణ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే వరకూ రైతు సంఘాలు మద్దతుగా నిలవాలని కోరారు. రైతు నాయకుడు గరవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు మోసపోయారన్న విషయాన్ని విశాలాంధ్ర పత్రికలో చూసిన తరువాతే తెలిసిందన్నారు.

గోదావరి ఆక్వా ఫుడ్ కాలుష్యం నియంత్రించండి: మధు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్, తుందుర్రు కాలుష్య నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్, తుందుర్రు నిర్మాణం పూర్తయితే... గాలి, మంచినీటి చెరువులు, పంట పొలాలు పూర్తిగా కాలుష్యం అవుతాయంటూ గతంలో ఆ ప్రాంత ప్రజలు ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ పరిశ్రమతో ఇప్పుడు భరించరాని కాలుష్యం వస్తోందని, తుందుర్రు, జొన్నలగరువు, బేతపూడి గ్రామాలను కాలుష్యం ఆవరించిందని వివరించారు. స్వయంగా గ్రామానికి వచ్చినప్పుడు నివారణా చర్యలు చేపడతామని మీరే హామీ ఇచ్చారన్నారు. గోదావరి మెగా ఫుడ్ పార్క్... పంట బోదెల నీరంతా వాడుకుంటున్నందువల్ల పక్కనే ఉన్న 80 ఎకరాల భూమి సాగు లేకుండా పోయిందన్నారు. ఇదే సమస్యపై ఆందోళనలు చేసిన రైతులు, మహిళపై నమోదైన కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు.

తిరుపతిలో మానవహారం

మహిళలపై హింసకు నిరసన

విశాలాంధ్ర-తిరుపతి: అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అన్నమయ్య సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థినులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.విజయలక్ష్మి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బీ నదియా మాట్లాడుతూ, దేశంలో ప్రతినిత్యం మహిళలపై హింస, లైంగిక దాడులు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వాల దృష్టికి తెచ్చిన నివారించలేని స్థితిలో ఉన్నాయని విమర్శించారు. మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తేవడానికి బీజేపీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న హింస, లైంగిక వేధింపులు నివారించడానికి చర్యలు చేపట్టకపోవడం మనువాద పోకడలకు అద్దంపడుతుందన్నారు. మహిళలకు రక్షణగా భేటీ బచావో చట్టాలను తీసుకొస్తానని నిత్యం అబద్ధాలు చెబుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతగానితనం వల్లే దేశంలో స్త్రీకి రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం రోజు కూడా మహిళలపై అనేకచోట్ల లైంగిక వేధింపులు జరుగుతున్నా, రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో మతోన్మాద బీజేపీ ప్రభుత్వం మహిళల చేతుల్లో పతనంకాక తప్పదని అన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, అరాచకాలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఉద్యమాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. మహిళా సమాఖ్య నగర నాయుకురాళ్లు ప్రమీల, హరిత, భువనేశ్వరి పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించనున్నారు. సీఎం జగన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారు. ఉదయం 11.10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సీఎం బయలుదేరి 11.20 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం చేరుకుని రాజ్యాంగ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 12.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

'e' Procurement Tender Notice

VMRDA invites the following Tender on 'e'-Procurement Platform

Sl. No.	Tender Notice Nos.	ECV in Rs.	Last Date&Time
1.	45/2022-23/SE/EE-I/VMRDA, Dt.24-11-2022	Rs.83,70,190/-	02-12-2022
2.	46/2022-23/SE/EE-I/VMRDA, Dt.24-11-2022	Rs.1,04,86,392/-	12-12-2022

For details Logon to www.apeprocurement.gov.in

Sd/-Metropolitan Commissioner
VMRDA

సంపాదకీయం

ఖడ్గేకు రెండు పరీక్షలు

ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లికార్జున్ ఖడ్గే ముందు రెండు ప్రధాన సమస్యలున్నాయి. రాజస్థాన్‌లో సచిన్ పైలెట్ ముఖ్యమంత్రి పదవి దక్కించుకోవడానికి మళ్లీ పావులు కదుపుతున్నారు. "200మంది సభ్యులుగల శాసనసభలో కాంగ్రెస్‌లో ఉన్న 102మందిలో ఎవరినైనా ముఖ్యమంత్రిని చేయొచ్చు కానీ ద్రోహి, అసమర్థుడు అయిన సచిన్ పైలెట్‌ను మాత్రం ముఖ్యమంత్రిని చేయడానికి వీలు లేదు" అన్నది రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ అభ్యంతరం. గత సెప్టెంబర్‌లో కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహించిన సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం గెహ్లాత్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడిని చేయాలనుకుంది. కానీ ఆయన ముఖ్యమంత్రిగా కూడా కొనసాగాలనుకున్నారు. జోడు పదవులు నిర్వహించకూడదన్న నియమం ఉంది కనక కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతించలేదు. గెహ్లాత్ అధ్యక్ష స్థానానికి పోటీ నుంచి తప్పుకోవలసి వచ్చింది. చివరకు మల్లికార్జున్ ఖడ్గే పోటీచేసి గెలిచారు. ఖడ్గే తమఅభ్యర్థి అని సోనియాగాంధీ కుటుంబంలో ఎవరూ అనకపోయినా ఖడ్గేకే వారి మద్దతు ఉందన్నది బహిరంగ రహస్యమే. రాజస్థాన్ శాసనసభకు ఎన్నికలు జరగడానికి మరోఏడాది గడువు ఉంది. 2018లో రాజస్థాన్ ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షుడిగా ఉన్న సచిన్ పైలెట్ కాంగ్రెస్‌కు అధికారం దక్కడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. అందువల్ల తనకు ముఖ్యమంత్రి స్థానం దక్కాలని ఆశించడంలో ఆశ్చర్యమూ లేదు. తప్పూలేదు. అయితే అధిష్ఠానవర్గం గెహ్లాత్‌ను ముఖ్యమంత్రిని చేసింది. అప్పటినుంచి సచిన్ పైలెట్ గుర్రుగానే ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి గెహ్లాత్ పోటీ చేస్తారనుకున్నప్పుడు మరో ముఖ్యమంత్రిని ఎంపిక చేయడానికి అధిష్ఠానం ఇద్దరు ప్రతినిధులను రాజస్థాన్‌కు పంపింది. అందులో ఖడ్గే కూడా ఉన్నారు. కానీ గెహ్లాత్ ముఖ్య మంత్రిగా కూడా కొనసాగాలని ఉవ్విళ్లూరారు కనక శాసనసభాపక్ష సమావేశానికి ఆయన వర్గం వారు హాజరు కాలేదు. ఇదంతా గెహ్లాత్ ప్రోద్బలంతోనే జరిగిందని చెప్పడానికి పెద్ద పాండిత్యం అక్కర్లేదు. ఇప్పుడు సచిన్ పైలెట్ మళ్లీ ముఖ్యమంత్రి పదవిమీద ఆశలు పెంచుకున్నారు. ససేమిరా ఆయన ముఖ్యమంత్రి కాకుండా చూడాలన్నది గెహ్లాత్ పంతం. అందుకని ఆయన సచిన్ పైలెట్ మీద తీవ్ర విమర్శలకు దిగారు. పైలెట్ ద్రోహి అని, అసమర్థుడని నిందించారు. ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోవడానికి పైలెట్ చాలా కాలం కిందటే ఓ ప్రయత్నం చేశారు. తనకు మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేలను గుర్‌గావ్ తీసుకెళ్లారు. ఇలా శిబిరాలు నిర్వహించడం ప్రస్తుత రాజకీయాల్లో మామూలే. ఆ ఉదంతాన్ని గెహ్లాత్ ఇప్పుడు మళ్లీ లేవనెత్తారు. బీజేపీతో కుమ్మక్కై తిరుగుబాటు చేశారు కనక పైలెట్ ద్రోహి అని నిందించారు. పైలెట్ తిరుగుబాటు వెనక కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హస్తం ఉందనీ, పైలెట్‌కు అనుకూలురైన ఎమ్మెల్యేలు నెలరోజులకు పైగా గుర్‌గావ్‌లో ఉన్నప్పుడు కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ వారిని తరచుగా కలుసుకునే వారనీ పైలెట్‌తో సహా ఒక్కో ఎమ్మెల్యేకి పది కోట్ల రూపాయలు ముట్టజెప్పినట్టు తన దగ్గర రుజువులున్నాయని గెహ్లాత్ వాదిస్తున్నారు. రుజువులున్నప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న గెహ్లాత్‌కు ఈ విషయంపై చర్య తీసుకోవడానికి అడ్డంకేమిటో తెలియదు. సచిన్ పైలెట్‌ను ముఖ్యమంత్రి స్థానంలో కూర్చో పెడ్తారన్న సమాచారం ఉంది కనకే తన మద్దతుదార్లు కేంద్ర ప్రతినిధులను కలుసుకోలేదని గెహ్లాత్ అంటున్నారు. ఆ సమయంలో పైలెట్ అనేకమంది ఎమ్మెల్యేలకు ఫోన్‌చేసి కొత్త శాసనసభాపక్ష నాయకుడిని ఎన్నుకునే అంశం అధిష్ఠానానికి వదిలేయాలని చెప్పారని కూడా గెహ్లాత్ అంటున్నారు. ఇందులో విచిత్రం ఏమీలేదు.

శాసనసభాపక్షం తమ నాయకుడిని ఎన్నుకునే పద్ధతి కాంగ్రెస్‌లో అంతమై దశాబ్దాలు గడుస్తోంది. ఇందిరాగాంధీ హయాంలో అయితే సీల్డ్ కవర్లో తమకు ఇష్టమైన నాయకుడి పేరు పంపేవారు. అధిష్ఠానం ప్రతినిధులు ఆ పేరు ప్రకటించగానే నాయకుడి ఎన్నిక పూర్తి అయిపోయేది. లేకపోతే నాయకత్వానికి పోటీ ఉందనుకున్నప్పుడు శాసనసభాపక్ష నాయకుడిని ఎంపికచేసే బాధ్యత అధిష్ఠానానికి అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం ఆమోదించేవారు. ఈ రెండు సందర్భాల లోనూ జరిగేది ఒకటే. అధిష్ఠానం ఇష్టానుసారమే శాసనసభాపక్ష నాయకుడెవరో తేలుతారు. ఈ తతంగం సీనియర్ నాయకుడైన గెహ్లాత్‌కు తెలియక కాదు. ఆరునూరైనా సచిన్ ముఖ్యమంత్రి కాకూడదన్నది ఆయన పంతం. ఇప్పుడూ అందుకే పైలెట్‌మీద ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆయనకు మద్దతిచ్చే ఎమ్మెల్యేలు పదిమంది కూడా లేరంటున్నారు. 80శాతం కాంగ్రెస్ శాసనసభ్యుల మద్దతు పైలెట్‌కే ఉందని ఆయన మద్దతుదార్లు వాదిస్తున్నారు. శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటుచేసి ఎవరికి ఎంత బలం ఉందో తేల్చుకోవచ్చు. కానీ అంత ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం చాలా సంవత్సరాలుగా కాంగ్రెస్ సంప్రదాయం కాదు. పైలెట్ మద్దతు లేకపోతే వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలలో రాజస్థాన్‌లో అధికారం నిలబెట్టుకోవడం సాధ్యంకాదని ఆయన గ్రహించడం లేదనుకోలేం. ఈ సమస్యను పరిష్కరించడం ఖడ్గే నాయకత్వ ప్రతిభకు పెద్ద పరీక్షే.

దీనికి తోడు రెండో సమస్యా ఉంది. సుదీర్ఘకాలం తరవాత అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన వెంటనే సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శశీ థరూర్ పోటీకి సిద్ధమయ్యారు. తాను గెలుస్తానన్న నమ్మకం ఆయనకు లేదు కానీ కాంగ్రెస్‌లో మళ్లీ సంస్థాగతంగా ప్రజాస్వామ్య విధానం వేళ్లూనుకుంటోందని చెప్పుకోవడానికి ఆయన పోటీ వీలుకల్పించింది. ఖడ్గే అధ్యక్షుడైన తరవాత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్థానంలో సారథ్య సంఘాన్ని నియమించారు. అందులో శశీ థరూర్‌కు స్థానంలేదు. ఇప్పటికీ అధిష్ఠానం థరూర్‌ను పరాయివాడిగానే చూస్తోంది. ఓటమి ఎదురైనప్పటికీ శశీ థరూర్ కుంగిపోలేదు. ఇప్పుడు ఆయన దృష్టి కేరళ మీద ఉంది. కేరళలో 2026లో తప్ప శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశం లేదు. 2021లో జరిగిన ఎన్నికలలో వామపక్షఫ్రంట్ రెండోసారి వరసగా అధికారంలోకివచ్చి రికార్డు సృష్టించింది. 2026లో జరిగే ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ నాయకత్వంలోని యు.డి.ఎఫ్. అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ అంచనా. అందుకే శశీ థరూర్ ఇప్పటినుంచే ముఖ్యమంత్రి పదవి అందుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఆయనకు ఓ ప్రధాన సమస్య ఉంది. కాంగ్రెస్ కేరళ విభాగంలో థరూర్‌కు ఉన్న మద్దతు నామమాత్రం. అయినా థరూర్ ప్రయత్నం మానుకోదలుచుకోలేదు. అందుకే మలబార్ యాత్రచేసి వచ్చారు. థరూర్ వ్యవహారాన్ని పరిష్కరించడమూ ఖడ్గేకు పరీక్షే. వెరసి ఆయన రెండు పరీక్షలు ఎదుర్కోవలసి ఉంది.

కీర్తి సరే... బోయినం మాటేమిటీ...!?

ఇది అందరినీ ఉద్దేశించేదే. ఏ ఒక్కరినో నిందించేది కాదు. ఓ రచయిత కథల పుస్తకమో... మరో కవి కవిత్వ సంకలనమో... లేదూ విమర్శకుడి గ్రంథమో పాఠకుల వద్దకు ఎలా చేరాలి. అంటే ఆయా రచనలను పాఠకులు కొని చదవాలా...? లేక ఆ రచనను కవో, రచయితో, విమర్శకుడో పంపితే చదవాలా...? నేనైతే ఏ రచన అయినా పాఠకులు కొనే చదవాలని అంటాను. సాధారణంగా తెలుగు సాహిత్య సృష్టి చేసే వారంతా మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వారై ఉంటారు. ఒక కవిత్వ సంకలనమో... కథా సంపుటో, విమర్శ గ్రంథమో ప్రచురించుకునే బాధ్యత ఆ కవి, రచయిత, విమర్శకుడిదే. మన దగ్గర పబ్లిషింగ్ హౌస్‌లు అంతగా లేవు. ఇతర భాషల్లో ఆ సౌకర్యం ఉంది కాబట్టి అక్కడ అది చెల్లుబాటు అవుతుంది. మన దగ్గర పబ్లిషింగ్ హౌసులే కాదు....పుస్తకాలు విక్రయించే వారు కూడా సృజనకారుల పట్ల ఓ చులకనభావంతో చూడడం నేను కళ్లారాచూసారు. తాను ప్రచురించిన తన కవిత్వసంకలనాన్ని ఓ ప్రముఖ పుస్తకాలషాపులో విక్రయించేందుకు పెట్టిన కవి ఆరు నెలల తర్వాత ఆ షాపుకు వెళ్తే మీరెవరు అన్నట్లు ఎగాదిగా చూస్తారు మన బుక్‌హౌస్ నిర్వాహకులు. తనని తాను పరిచయం చేసుకుని "ఆరు నెలల క్రితం నా కవిత్వ సంకలనాలు ఇచ్చాను అమ్మకానికి. ఎన్ని అమ్ముడయ్యాయి..? నాకు డబ్బులేమైనా ఇస్తారా..?" అని అడిగితే ఓ వెర్రిబాగులాడ్ని చూసినట్లు చూస్తారు మన పుస్తక విక్రేతలు. అలా చూడడమే కాదు.. "ఆరు నెలలకేనా... నెక్స్ట్ ఇయర్ రండి. చూద్దాం. ఏమైనా అమ్ముడైతే మీకు డబ్బులు ఇస్తాం" అని సమాధానం చెప్తారు. ఒకవేళ ఆ షాపు యజమాని చెప్పినట్లే ఆ తర్వాత సంవత్సరం వెళ్తే అప్పుడు కూడా బ్రూ కాఫీ ప్రకటనలా ఇంచుమించు అదే సమాధానం. ఇలాంటి సమయాల్లో కవులు, రచయితలు, విమర్శకులు తమ పుస్తకాలను ఎలా అమ్ముకుంటారు.

ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ అంటే కాసింత ఎక్కువ ఖర్చే. ఏభై వేలో, అరవై వేలో ఖర్చు చేసి పుస్తకం ముద్రించి దాని ఆవిష్కరణ అట్టహాసంగా చేసి, అందుకోసం మరో పదో పరకో ఖర్చు చేసిన కవి, రచయిత ఆ పుస్తకాలు కొనుక్కునే వారు లేక ఇంట్లో ఓ మూల పెట్టుకోవాలి. పత్రికల్లో ఆ పుస్తకం గురించి సమీక్షవస్తే వెంటనే "అవును నీ పుస్తకం నాకు పంపలేదేం" అంటూ ఫోన్లూ తప్పవు. ఓ మిత్రుడు పుస్తకం తీసుకువచ్చాడు. అది హిట్ అయ్యింది. ఆ రచయిత ఓ 20 మందికి మాత్రమే కాంప్లిమెంటరీ కాపీలు పంపాలనుకున్నాడు. అలాగే పంపాడు కూడా. ఈ లోగా పుస్తకం గురించి తెలుసుకున్న ఓ పెద్దపత్రికలో కామెడీ కాలమిస్టు ఆ రచయితకి ఫోన్ చేసి "నాకు పుస్తకం పంపలేదేమిటీ"అని అడిగేశాడు కూడా. "కొందరికే కాంప్లిమెంటరీలు పంపానండి" అని చెప్పిన సమాధానానికి వెంటనే సదరు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

కాలమిస్టు "ఆ కొందరిలో నేను లేనా" అంటూ ఏదో జోకులా నవ్వాడట. పోనీ అని ఆ కాలమిస్టు మధ్య తరగతి వాడో, పుస్తకం కొనుక్కోలేని వాడో కాదో...బాగా డబ్బుచేసినవాడే. ఇలాఉంటుంది మన సాహిత్య అభిమానుల తీరు.

గతంలో ఎస్.ఎస్. కో శేషాచలం అండ్ కంపెనీ అని పబ్లిషింగ్ హౌస్ ఉండేది. అదే నేటి ఎమ్మెస్కోకు ఒరిజినల్ ఎమ్మెస్కో అంటారు. దాని యజమాని ఎం.ఎన్.రావు. ఆయనకు కవులన్నా, రచయితలన్నా చాలా గౌరవం. ఆయన ఎవరివైనా పుస్తకాలు వేస్తే... ఆ రచయితో, కవో కనపడగానే ఎంతో కొంత డబ్బులు ముందు చేతిలో పెట్టి మాట్లాడే వారట. ఎంతటి ఆదరణ సృజనకారులంటే. అలాంటి వారి కోసం భూతద్దం పెట్టి వెతికినా దొరకరు. ఆ మధ్య ఓ కవి మిత్రుడు ఓ పబ్లిషింగ్ హౌస్‌కు వెళ్లి అమ్మకానికి ఇచ్చిన తన పుస్తకాల డబ్బులు అని అడిగితే... " ఎక్కడా పుస్తకాలపై వచ్చిన డబ్బులతోనే ఈ షాపు కట్టాం. డబ్బులన్నీ ఇది కట్టడానికే అయిపోయాయి. కొన్నాళ్లు పోయాక రండి. డబ్బులేమైనా వస్తే ఇస్తాం" అని సమాధానం చెప్పారట ఆ పబ్లిషింగ్ హౌస్ మేనేజర్. మనం వేలు పోసి పుస్తకాలు వేయడమేమిటీ... ఆ డబ్బులతో వీళ్ల బిల్డింగులు కట్టుకోవడమేమిటీ అని ఆ కవి మిత్రుడు వాపోయాడు.

ఈ తరం యుద్ధ కవిత అని డబ్భైల్లో ఓ కవిత్వ సంకలనం వచ్చింది. అందులో ఓ కవిత చాలాఫేమస్. "నన్నయ్యగొప్పవాడు..నాకు ఆకలేస్తోంది" అని ప్రారంభమై "దేశ భాషలందు తెలుగులెస్స...నీయబ్బా నాకు ఆకలేస్తోందిరా" అని ముగుస్తుంది. దాన్ని కాస్త మార్చి చదువుకుంటే "మన సృజనకారులు గొప్పవారు... వాళ్లకి ఆకలేస్తుంది" అని ప్రారంభమై.... "మన దగ్గర చాలా మంచి సాహిత్యం వస్తోంది....వాళ్లకి ఇంకా ఆకలేస్తూనే ఉంది" అని ముగించాలి. అవును, నేను ఈకవితను అలాగేముగిస్తాను. మన సృజనకారుల పుస్తకాలు కొనుక్కుని చదవండి. వాళ్లు లాభాలు అడగడం లేదు. వాళ్లు పెట్టిన పెట్టుబడి అడుగుతున్నారు. అది కూడా మంచి సాహిత్యాన్ని మీకందిస్తున్నారంటేనే కొనుక్కోండి. పుస్తకాల పండుగలు వస్తున్నాయి. అక్కడ పుస్తకాలు కొని చదవండి. పుస్తకాలు ఉచితంగా అందరికీ పంచితే ఫోన్లలో కీర్తి వస్తుంది. కాని ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి విధిగా ఆకలేస్తుంది. పతంజలి రాసిన వీర బొబ్బిలి నవల్లో... గోపాత్రుడు అడుగుతాడు "నీకు బోయినం ముఖ్యమా... విశ్వాసం ముఖ్యమా"అని.... అప్పుడు బొబ్బిలి "ఇప్పుడు టైం పన్నెండు అయ్యింది కదా... బోయినమే ముఖ్యం. ఆకలి తీరాక విశ్వాసం గురించి ఆలోచిద్దాం" అంటూ బదులిస్తుంది. అందుకే కీర్తి సరే.... బోయినం మాటేమిటో... ఆలోచించండి.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు. 99120 19929

దాచినా దాగని సత్యం

కృష్ణ ఝా

బ్రిటీష్ వలసవాదుల చెరసాలలో ఉన్న సావర్కర్ తనను విడిచి పెట్టమని, రక్షించమని బ్రిటీషర్లకు చాలాసార్లు విజ్ఞప్తి చేశాడనేది సత్యం. తాజాగా లభ్యమవుతున్న లేఖలు శిక్ష మాఫీని కోరినట్లు రుజువు చేస్తున్నాయి. ఈ లేఖల్లో సావర్కర్ క్షమాపణలు చెప్తూ బ్రిటీష్ ప్రభుత్వాన్ని వేడుకోవడమే కాకుండా తనను విడుదల చేస్తే తాను జీవితాంతం బ్రిటీష్ ప్రభుత్వానికి విధేయుడిగా ఉంటానని స్పష్టంగా పేర్కొన్నాడు. 1936-43 మధ్యకాలంలో దీర్ఘకాలిక వైస్రాయ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన లిన్‌లిత్‌గో తాను భారతదేశ సెక్రటరీకి రాసిన లేఖలో ఈ విషయాన్ని స్పష్టీకరించారు. ఈ లేఖ అక్టోబరు 7, 1939 లో సావర్కర్‌ను వైస్రాయ్ రెండు రోజులలో కలుస్తాడనగా రాశారు. సావర్కర్‌తో సమావేశమైన తర్వాత అక్టోబరు 9న ఈ విషయంపై రిపోర్టును వైశ్రాయ్ తిరిగిరాశారు. భారత్‌లో బ్రిటీష్ స్వార్థ కుటిల ప్రయోజనాల దృష్ట్యా వైస్రాయ్‌లేఖ ప్రాధాన్యతను గుర్తించాడు. ఆ లేఖలో సావర్కర్ "ప్రయోజనాలు ఒకటే, అందువల్ల మేము కలిసి పనిచేయాలని" పేర్కొన్నాడు. ఇది చాలదన్నట్లుగా ఆ లేఖలో సావర్కర్ హిందూ మహాసభ గురించి ప్రస్తావించాడు. యుద్ధం ముగింపులో పత్యేక ప్రతిపత్తి హోదా ఇస్తే సరిపోతుందనే సందేహాస్పదమైన ప్రతిపాదన చేశారు. (వివరాలు: ఇండియా ఆఫీసు(ఐఓ), ఎమ్ఎస్ ఈయూర్ ఎఫ్125/8 1939 భారత రాజ్య కార్యదర్శికి రాసిన లేఖలు.

దేశంలోని వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి బ్రిటీష్ వలసవాదం నుంచి పూర్తి స్వేచ్ఛ, స్వతంత్ర్యాలు కావాలని తీవ్రంగా పోరాటం చేస్తున్న రోజులవి. దేశాన్ని విముక్తి చేస్తే ఫాసిస్టు శక్తులను నిలువరించేందుకు వీలవుతుందని, మిత్రదేశాలకు ఇది మరింత తోడ్పడుతుందని వారు ఆశించారు. కాని సావర్కర్ స్వాతంత్ర్య పోరాటానికి విరుద్ధంగా వ్యవహరించాడు. 1911 ఆగస్టు 30నాడు అంతక్రితం లేఖరాసిన రెండు నెలల్లోపు క్షమాభిక్ష కోసం పిటిషన్ పెట్టాడు. ఈ పత్రం తనను సెల్యులార్ జైలుకు రెండు రోజుల్లో తరలిస్తారనగా రాసినది. తాను రాసిన లేఖలలో ఒక లేఖలో వారు ఇష్టపడిన ఏ హోదాలోనైనా తాను ప్రభుత్వానికి సేవ చేసేందుకు విధేయతతో సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. నా మార్పిడి నా మన:సాక్షికి అనుగుణంగా ఉంటుంది. భవిష్యత్తులో నా ప్రవర్తన కూడా ఈ తరహాగానే ఉంటుందని ఆశిస్తున్నాను. నన్ను జైలులో ఉంచడం ద్వారా ఏమీ పొందలేరు. బలవంతుడు మాత్రమే దయతో ఉండగలడు. తప్పిపోయిన కుమారుడు తల్లి, దండ్రులు అనే ప్రభుత్వం తలుపు తట్టడం తప్ప మర్కెడికి తిరిగిరాగలడు? అని ఆ లేఖలో పేర్కొన్నాడు. సావర్కర్ తన వాగ్దానాన్ని ఆచరణలో ఎప్పుడూ ఉల్లంఘించలేదు. సహాయ

నిరాకరణోద్యమం పిలుపుమేరకు దేశవ్యాప్తంగా బ్రిటీష్ ప్రభుత్వం మొదట గొప్ప తిరుగుబాటును ఎదుర్కొన్నప్పుడు అదే సమయంలో భారతీయులను విభజించాలని తహతహలాడుతున్న సమయంలో సావర్కర్ పుస్తకం "హిందూత్వ-ఎవరు హిందువు" అనే పుస్తకం వెలుగులోకి వచ్చింది. ఈ పుస్తకంలో శత్రువులుగా పరిగణించే ముస్లింలకు వ్యతిరేకంగా సావర్కర్ హిందూత్వ సిద్ధాంతం బహిర్గతమైంది. వలసవాద వ్యతిరేక జాతీయవాద పోరాటంలో హిందువులలో కొంత భాగాన్ని చేరకుండా నిలువరిస్తానని సావర్కర్ వాగ్దానం చేశాడు. అంతేకాకుండా బ్రిటీష్ వారు 'విభజించు పాలించు' విధానాన్ని ప్రోత్సహించడంలో సహాయం చేస్తానని ఆ పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నారు. భారతదేశంలో వలసవాద బ్రిటీషర్లకు అడుగులకు మడుగులొత్తుతానన్న తన వాగ్దానాన్ని అమలు చేయడమేకాకుండా, రత్నగిరి వెలుపల అతని కదలికలపై ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో దానికి మరింత స్పష్టత చేకూరింది.

సావర్కర్ నిరంతరం తన కదలికలను హిందువులు, ముస్లింలు అనే రెండు వర్గాల మధ్య వైరాన్ని సృష్టించే దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేయడం ప్రారంభించాడు. 1937 డిసెంబరులో హిందూ మహాసభ అధ్యక్షుడైన వెంటనే సావర్కర్ భయంకరమైన రాజకీయ పంథాను ఎంచుకున్నాడు. దీనితో అంతవరకు హిందూ, ముస్లింల మధ్య నెలకొన్న ప్రేమ, సోదరభావానికి పతనదశ ప్రారంభమైంది. అహ్మదాబాద్‌లో జరిగిన హిందూ మహాసభ 19వ వార్షిక సమావేశంలో మాట్లాడుతూ, భారతదేశంలో రెండు విరుద్ధమైన దేశాలు పక్కపక్కనే నివసిస్తున్నాయి అన్నాడు. విడిపోయిన ముక్కలను అతికించవచ్చునని చాలామంది రాజకీయ నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తూ తప్పులు చేస్తున్నారన్నాడు. భారతదేశం నేడు ఏకీకృత స్వజాతిదేశంగా లేదు. దీనికి విరుద్ధంగా ఈ దేశంలో ప్రధానంగా హిందువుల, ముస్లింలు అనే రెండు దేశాలున్నాయని వ్యాఖ్యానించాడు.

సావర్కర్ చేపట్టిన హిందూత్వ మార్గంతో నేల రక్తసిక్తమై తడిసిపోయి మరణమృదంగమైంది. సావర్కర్ వైస్రాయ్‌ను కలిసిన కొన్నిరోజుల తర్వాతనే 1940 ప్రాంతంలో ముస్లింలీగ్ కూడా దీనిని అనుసరించింది. భారతదేశ జాతీయ ఉద్యమ చరిత్రలో అత్యత కీలకమైన చివరి దశలో విభజన, డిమాండ్ అనేది బ్రిటీష్ ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యంగా ఉంది. విభజించు పాలించు అనే సిద్ధాంతానికి పూర్తి విజయాన్ని చేకూర్చింది. భారతదేశంలో జాతీయవాదులను సంప్రదించకుండా సెప్టెంబరు 3, 1939న రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో లిన్లిత్‌గో ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటన ప్రకారం, రెండవ ప్రపంచ యుద్ధంలో భారతదేశం భాగస్వామ్యాన్ని ప్రకటించాడు. దీనికి నిరసనగా నెలరోజుల్లోనే కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేశారు. బ్రిటీషర్ల ప్రచారానికి నిరసనగా 1940 అక్టోబరులో గాంధీ కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించారు. భారత్‌ను బ్రిటీషర్లు తమ కబంధ హస్తాల్లో బంధిస్తూనే ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాస్వామిక శక్తులకు మద్దతు పలకాలన్న బ్రిటీష్ నిర్ణయంలోని నయవంచనను జాతీయవాదులు ఎత్తిచూపారు. దీనికి వ్యతిరేకంగా యుద్ధం తర్వాత సావర్కర్ అధీకృత హోదాకు అంగీకరించాడు. 1940లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అండ్ వార్‌లో పాల్గొంటానన్న తన ఉద్దేశాన్ని సావర్కర్ బహిరంగపరచాడు. 1942 లో జాతీయవాదులు క్విట్‌ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు సావర్కర్ హిందూత్వ వాదులంతా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి అండగా నిలిచారనేది చరిత్రలో సుస్పష్టమైన అంశం.

అతివలపై ఆగని హింస

స్త్రీలను శారీరకంగా, మానసికంగా హింసించి ఆనందించడం మానవ లక్షణాలు కోల్పోయిన దుర్మదాంధులు చేసే వికృత క్రీడలో ఒక భాగం. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలపై ఇంకా అనేక అరాచకాలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయి. పశువాంఛతో స్త్రీలను హింసించి, హతమార్చే నీచ సంస్కృతి మారాలి. పాఠశాలలకు పంపించాలంటే భయం. పై చదువులు చదవించాలంటే భయం. ఉద్యోగాలు చేయాలంటే భయం... అంతెందుకు మాతృ గర్భం నుండి జన్మించిన మరుక్షణం నుండే ఆడజన్మకు అగచాట్లు ఎదురౌతున్నాయి. భ్రూణ హత్యల నుండి, లైంగిక అత్యాచారాల వరకు, వరకట్న వేధింపుల నుండి, హత్యల వరకు అనాదిగా స్త్రీ జాతి ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతం. స్త్రీ ని అగౌరవంగా చూస్తూ, శీల హననానికి గురిచూసే ఆటవిక ప్రవృత్తి మారాలి. ఇదో రంగుల ప్రపంచం. అనునిత్యం వినూత్నమైన సంఘటనలతో నిత్య నూతనంగా కనిపించే కృత్రిమ ప్రపంచంలో జీవించడమే ఆధునిక నాగరికత నేర్పిన అరుదైన విద్య.

మానవత్వం స్థానంలో 'పశుత్వం' ప్రబలినా అలాంటి అమానుషత్వాన్నే కనులారా వీక్షించి, మనసారా ఆస్వాదించి, ఆరాధించే మనస్తత్వాలతో ఆటవిక నాగరికత పునరారంభం కాబోతున్నది. దానవత్వాన్ని పునరావృతం చేసి, సర్వత్రా వ్యాపింపచేసి,ఆనందించడమే ఒక కళగా మారిన నేపథ్యంలో మానవత్వమనే మాట చమురులేని దీపంలా ఆరిపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించాలనే మేథావుల మాటలు, ప్రవచనకర్తల ఉపదేశాలు కేవలం వినడానికే తప్ప ఆచరించడానికి అవకాశం లేని పరిస్థితులు దాపురించాయి. భారతదేశం అనాదిగా విలువలకు ప్రతిరూపం. కొందరి ప్రబుద్ధుల వక్రబుద్ధుల వలన మానవ సమాజం అపఖ్యాతి పాలవుతున్న నేపథ్యంలో ఆవేదనతో, ఆక్రందనతో ప్రశ్నించాలని ప్రయత్నించడం నిజంగా ఒక అభ్యుదయ భావమే. ఒక చైతన్య వికాసమే. అయితే ప్రశ్నించే గళాలు మూగబోతున్నాయి. నిరాశతో నిశ్శబ్దం ఆవహిస్తున్నది. ఆక్రోశంతో, ఆవేశంతో, తమ ఆవేదనను వెళ్లగక్కే కలాలు నిశ్శబ్దంతో చెలిమి చేస్తున్నాయి. ఇది ఈనాటి సమస్య కాదు. ఇది అనాదిగా సాగుతున్న తంతు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ పైశాచిక క్రీడా విన్యాసం పరాకాష్ఠకు చేరింది. ప్రభుత్వాలు ఎన్ని

చట్టాలు చేసినా, రాజ్యాంగంలో ఎన్ని సవరణలొచ్చినా, ప్రజల్లో ఐక్యత కొరవడిన కారణంగా చట్టాలను సైతం నిర్వీర్యం చేసే చీకటి వ్యవస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్త్రీల పట్ల చులకన భావనతో వారిని ఆర్థికంగా ఎదగనీయకుండా అన్ని రంగాల్లో అణగదొక్కే పురుషాధిక్య ప్రపంచాన్ని ధిక్కరిస్తూ ఎంతో మంది మహిళామణులు సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, విద్య, వ్యాపార,విజ్ఞాన సాంకేతిక రంగాల్లో ప్రవేశించి తమ నైపుణ్యంతో ప్రపంచాన్నే శాసిస్తూ స్వావలంభన, సాధికారత దిశగా పయనించడం నడుస్తున్న చరిత్రలో చోటు చేసుకుంటున్న మహిళల ప్రతిభా పాటవాల ప్రగతికి సంబంధించిన పరివర్తనాక్రమం. అయితే మహిళలను చులకనగా చూడడం, వారిని ఆర్థికంగా ఎదగనీయకపోవడం, మహిళల పట్ల హింసాత్మక ధోరణి పెంపొందించుకోవడం ఆధునిక యుగంలో కొనసాగుతున్న అజ్ఞానానికి పరాకాష్ఠ. మహిళలను హింసించే వైఖరి నశించాలి. ప్రపంచవ్యాప్తంగా మహిళలపై కొనసాగుతున్న హింస జుగుప్సాకరం. అంతర్జాతీయ సమాజం ఇకనైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో స్త్రీ జాతి అంతరించి పోయి, మగువ లేని ప్రపంచం ఆవిర్భవించే విపరీత పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయి. నవంబర్ 25 వ తేదీన జరిగిన అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవం సమాజంలో పరివర్తన తీసుకురావడానికి దోహదం చేస్తుందా?

-సుంకవల్లి సత్తిరాజు, 9704903463

ఉపాధి, ఉద్యోగ కల్పనలో మోదీ వైఫల్యం!

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో గత ప్రభుత్వాల కన్నా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఈ రంగాలను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. రైతాంగ భూములను కార్పొరేట్ల స్వాధీనం చేయడం, రైతాంగం పండించే పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించక పోవటం, ఎరువుల ధరల నిర్ణయం నుంచి తప్పుకుని పరిశ్రమాధిపతులకు అప్పగించటం, సేద్యపు ఖర్చులు పెరిగే విధానాలు అమలు జరపటం, సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి సాగు నుంచి రైతాంగం వైదొలగేలా చేయటం, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరించటం, అమ్మి వేయడంతో అనేక పరిశ్రమలను మూసివేయటం జరుగుతోంది. మోదీ ప్రభుత్వం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను సంక్షోభంలోకి నెట్టడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కుదించుకుపోయి నిరుద్యోగం పెరుగుతూ వస్తున్నది. అత్యధిక మందికి ఉపాధిని కల్పిస్తున్న వ్యవసాయంలో మితిమీరిన యాంత్రీకరణ గ్రామీణ ఉపాధి పనులను 150 రోజుల నుంచి 80 రోజులకు పడిపోయేలా చేసింది. పరిశ్రమల మూసివేత, అమ్మివేతలతో లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవటం, వాటిపై బ్రతికే పట్టణ పేదలు ఉపాధి కోల్పోతున్నారు.

మోదీ నాయకత్వాన ఉన్న ఎన్‌డీఏ 2014 సాధారణ ఎన్నికల సందర్భంలో తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానంచేసింది. నిరుద్యోగంతో బ్రతుకు తెరువు కానరాని యువత దానికి ఆకర్షితులై ఎన్‌డీఏకు ఓట్లు వేసి మోసపోయారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగకల్పన మాట మర్చిపోయి ఉద్యోగ, ఉపాధిని హరించే విధానాలు చేపట్టింది. ఫలితంగా నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ప్రవీణ్ సిన్హా 2013 నివేదిక ప్రకారం కార్మిక శక్తిని

భారత ప్రభుత్వం మూడు వర్గాలుగా విభజించింది. వ్యవసాయ కూలీలతో కలసి గ్రామీణ రంగం, ఫ్యాక్టరీలు, సేవా పరిశ్రమల కార్మికులను కలిగి ఉన్న పట్టణ అధికారిక రంగం, పట్టణ అనధికార రంగం. భారతీయ కార్మిక రంగం, అనధికారిక రంగాలు 2011లో 93శాతం ఉపాధి పొందారు. 1980-2010 మధ్య ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం నిరుద్యోగం 2.8శాతంగా ఉంది. 1983లో దేశంలో నిరుద్యోగిత 7.8 మిలియన్లు కాగా 2004-5 నాటికి 12.3 మిలియన్లకు పెరిగింది.

ఎన్‌డీఏ పాలనలో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందని చేస్తున్న ప్రచారం డొల్లఅని గత నాలుగు సంవత్సరాలుగా దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ గణాంకాలు బట్టబయలు చేస్తున్నాయి. దీన్ని రుజువు చేసే విధంగా 2018-19లో ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం సుమారుగా 18.6 మిలియన్లమంది భారతీయులు నిరుద్యోగులుగా ఉన్నారు. మరో 393.7 మిలియన్లమంది చిన్న చిన్న ఉద్యోగాల్లో ఉన్నారు. బిజినెస్ టుడే నివేదిక ప్రకారం, నోట్ల రద్దు తర్వాత ప్రభుత్వ ఏజెన్సీ నిర్వహించిన ఉపాధి మొదటి సర్వే నివేదిక ప్రకారం సాధారణ నిరుద్యోగ స్థితి 6.1శాతం ఉంది. ఈ కాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పురుష నిరుద్యోగ యువత శాతం 17.4శాతం నుంచి 18.7శాతానికి పెరిగింది. 2019-20లో జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన నివేదికలో 2021 జనవరి-మార్చి త్రైమాసికంలో పట్టణ నిరుద్యోగం 9.3శాతం ఉంది.

నిరుద్యోగం, అప్పుల వలన ఆత్మహత్యలు జరుగుతున్నాయి. 2022 ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంటు, రాజ్యసభ సమావేశాల్లో ఒక సభ్యుడు అడిగి ప్రశ్నకు శాఖ సహాయమంత్రి నిత్యానంద్‌రాయ్ ఇచ్చిన సమాధానంలో 2018-20 సంవత్సరాల మధ్య నిరుద్యోగం, అప్పుల కారణంగా దేశంలో 25వేల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని, నిరుద్యోగం కారణంగా 9,140 మంది, అప్పుల కారణంగా 16,091మంది ఆత్మహత్యల జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. 2020లో కోవిడ్ కారణంగా నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగాయని, ఇవన్నీ జాతీయ నేరాల నమోదు బ్యూరో ఇచ్చిన లెక్కల ప్రకారం తెలియ చేస్తున్నానని లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సంవత్సరం నెలల కాలంలో నిరుద్యోగం తగ్గుముఖంపట్టిందని మోదీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. జూన్ నెలలో 7.80 శాతం నుంచి 6.89శాతానికి నిరుద్యోగం తగ్గిందని లెక్కలు చెబుతున్నాయి. ఈ మాసాల్లో దేశవ్యాపితంగా వ్యవసాయ పనులు దొరుకుతాయి. దీన్ని చేపట్టి నిరుద్యోగం తగ్గుముఖం పట్టినట్లుగా మోదీ ప్రభుత్వం చెప్పటం ప్రజలను మోసగించటమే. ఈ పనులు ముగియగానే ఉపాధి మందగించి నిరుద్యోగం పెరుగుతోంది. నిరుద్యోగ శాతం పెరగటానికి మోదీ ప్రభుత్వం చెప్పే కారణం చాలా విచిత్రంగా ఉంది. యువత చదువులకు మొగ్గు చూపడం, పిల్లలను, వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యతతో కార్మికులు పని ప్రదేశాలను విడిచి పెట్టారని మోదీ చెప్పటం ప్రజలను మోసగించడమే.

బొల్లిముంత సాంబశివరావు,
సెల్ : 9885983526

ప్రసార భారతికి సవాల్‌గా డిజిటల్ యుగం

కోవిడ్ లాక్‌డౌన్‌లో సేవలకు విశేష గుర్తింపు

25ఏళ్లు పూర్తి చేసుకున్న సంస్థ

న్యూదిల్లీ: భారతదేశ స్వయంప్రతిపత్త ప్రభుత్వరంగ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ 'ప్రసార భారతి' రజతోత్సవాన్ని జరుపుకొంది. 25 ఏళ్ల కిందట 1997 నవంబర్ 23న చట్టబద్ధమైన బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌గా ప్రసార భారతి ప్రారంభమైంది. దూరదర్శన్, ఆలిండియా రేడియోను కలిపి ప్రసార భారతిగా ఏర్పాటు చేశారు. కొవిడ్-19 లాక్‌డౌన్‌లో సేవలకుగాను విశేష గుర్తింపు పొందింది. ప్రజల విశ్వాసం పొందింది. అయితే స్పష్టమైన సాంకేతిక దృక్పథం, భవిష్యత్ కోసం మానవశక్తి కార్యాచరణ ప్రణాళికతో ఈ బలాలను మరింత సృజనాత్మకంగా నిర్మించుకునే తీరుపైనే రాబోయే 25 సంవత్సరాల్లో సంస్థ మనుగడ ఆధారపడి ఉంటుందని సంస్థ మాజీ సీఈవో శశి శేఖర్ వెంపటి వెల్లడించారు. ప్రసార భారతి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రసార భారతి పురోగతి, సవాళ్ల గురించి తెలిపారు.

రజతోత్సవ వేడుకల వేళ ప్రసార భారతి ముందు అనేక సవాళ్లున్నాయని చెప్పారు. సమాచార సాంకేతికత ద్వారా తన కార్యకలాపాలను మరింత ఆధునీకరించడానికి ఐదేళ్ల సంస్కరణల పథాన్ని వేగవంతం చేయాలి. ప్రస్తుత డిజిటల్ యుగానికి చెందిన ప్రేక్షకుల నాడికి తగినట్టుగా ఆకట్టుకునే కంటెంట్, సృజనాత్మక కార్యక్రమాలను ప్రసారం చేయాలి. పదవీ విరమణ పొందుతున్న 2000 మంది ఉద్యోగుల స్థానాన్ని యువతతో భర్తీ చేయాలి. అలాగే వాణిజ్య నిర్వహణ కోసం అదనపు నిధులు కేటాయించాలి. సేల్స్, మార్కెటింగ్, డిజిటల్, ఐటీ వంటి ప్రత్యేక విభాగాల్లో సమర్థమైన మానవవనరుల కోసం మరింత బడ్జెట్ కేటాయించాలి. మార్కెట్‌లో పోటీని తట్టుకునే విధంగా రూపుదిద్దుకోవాలి. ప్రసార భారతి నియామక నియమాలను, చట్టంలోని సంబంధిత నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉంది' అని శశిశేఖర్ తెలిపారు. 2047 నాటికి నవభారతదేశం విజన్‌కు అనుగుణంగా ఉండాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా టెక్నాలజీ కన్వర్జెన్స్, మీడియా కంటెంట్ వినియోగం పెరుగుతోందని, బ్రాడ్‌కాస్ట్ ఆటోమేషన్, ఐటీ ఆధార ఇంటిగ్రేషన్ మరింత కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. మీడియా కంటెంట్ డిమాండ్ నేపథ్యంలో భవిష్యత్తులో వినియోగదారులకు సౌలభ్యంగా సేవలు అందించేందుకు క్లౌడ్-ఆధారిత ప్రసార నిర్వహణకు మారడం అనివార్యం అవుతుంది. ఇక చివరగా ఒక పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, అంతర్జాతీయంగా గుర్తింపును విస్తరించుకోవడానికి.. ఆర్కైవల్ కంటెంట్ నుంచి రియల్ ఎస్టేట్ ఆస్తుల వరకు డబ్బు ఆర్జించడానికి ఉన్న కొత్త మార్గాలపై దృష్టి సారించాలి. స్మార్ట్‌ఫోన్లు, ఇతర స్మార్ట్ పరికరాలకు నేరుగా ప్రసారం చేసే వ్యాపార నమూనాగా డైరెక్ట్ మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్, డీ2ఎంతో డీడీ ఫ్రీడిష్‌ను రూపొందించడానికి పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్‌కు అవకాశం ఉంది' అని ఆయనన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందిన ఏడేళ్లకు ప్రసార భారతి ఏర్పాటు జరిగిందని గుర్తుచేశారు. సంస్థకు చెందిన ఉద్యోగుల్లో ఎక్కువ మంది మరికొన్ని సంవత్సరాల్లో పదవీ విరమణ పొందనున్నారని, శ్రామికశక్తిలో గణనీయమైన మార్పుతో ప్రసార భారతి నాలుగు రోడ్ల కూడలిలో నిలిచిందన్నారు.

'ప్రసార భారతి తొలి 20 ఏళ్ల వరకూ తగిన గుర్తింపు పొందలేకపోయింది. పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్‌గా కాలంతో పోటీ పడలేకపోయింది. దీనికి తోడు కొందరు వాటాదారులు చట్టబద్ధత కోసం సుదీర్ఘ పోరాటం చేశారు. ప్రసార భారతి ఏర్పాటు సమయంలో అప్పటికే ఉన్న ఏఐఆర్, డీడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా డిప్యూటేషన్ కల్పిస్తూ కొత్త సంస్థలో కొనసాగించాలని నిర్ణయించారు. సేవా సంబంధిత విషయాలపై వివాదాలు దశాబ్దాలుగా పరిష్కరించలేని చేదు అనుభవం ఉన్నప్పటికీ, ఆ ఉద్యోగులను కొనసాగించారు. వీక్షకుల సంఖ్య, ఆదాయం విషయంలో ప్రైవేట్ మీడియాతో పోటీలో వెనుకబడటానికి ఇవే ప్రధాన కారణమయ్యాయి. పదవీ విరమణ అంచున ఉన్న ఈ ఉద్యోగులతో శ్రామికశక్తి తగ్గిపోయి, సంస్థ మరొక క్లిష్ట పరిస్థితుల్లో నిలిచింది' అని అన్నారు. ప్రపంచంలోని పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ సంస్థలన్నింటికీ లైసెన్స్ ఫీ ప్రధాన ఆదాయ మార్గంగా ఉంటుందిగానీ ప్రసార భారతి ఇందుకు పూర్తి భిన్నమని ఆయన తెలిపారు.

భారత్ జోడో యాత్రపై బీజేపీ కుట్ర: జైరాం

న్యూదిల్లీ: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రను అప్రదిష్ఠపాలు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో యాత్రలో 'పాకిస్తాన్ జిందాబాద్' అన్న నినాదాలు వినిపించాయంటూ బీజేపీ ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ పోస్ట్ చేసిన వీడియోను కాంగ్రెస్ పార్టీ నకిలీదిగా అభివర్ణించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ... విజయవంతంగా సాగుతున్న భారత్ జోడో యాత్రపై దుష్ప్రచారం చేయడానికి బీజేపీ దుష్ట పన్నాగాలకు పాల్పడుతోందన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని, బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్ నాథ్ పాదయాత్ర చేస్తున్న వీడియో(21 సెకన్ల నిడివి)ను మాలవీయ పోస్ట్ చేశారు. ఈ వీడియోను మొదట మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పోస్ట్ చేసిందని, కానీ పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు వినబడిన తర్వాత తొలగించిందని చెప్పారు. జైరాం స్పందిస్తూ... 'చట్టబద్ధంగా అవసరమైన చర్యలు వెంటనే తీసుకుంటున్నాం. మేము అటువంటి వ్యూహాలకు సిద్ధంగా ఉన్నాం. బదులు చెల్లిస్తాం' అని ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో... ఛతర్‌పూర్ జిల్లాలో డైమండ్ మైనింగ్ ప్రాజెక్ట్ కారణంగా నిర్వాసితులైన గిరిజన కుటుంబాలను రాహుల్ గాంధీని కలవకుండా మధ్యప్రదేశ్ ప్రభుత్వం భయపెట్టి నిరోధించిందని రమేష్ పేర్కొన్నారు. ఇది బీజేపీ ప్రజాస్వామ్యం అని ఎద్దేవా చేశారు.

సువేందు అధికారితో మమత భేటీ

కోల్‌కతా: గతేడాది ఎన్నికల తరువాత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారిని అసెంబ్లీలోని ఆమె చాంబర్‌లో కలుసుకున్నారు. దీనిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అనంతరం సభలో 'రాజ్యాంగ దినోత్సవం'పై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ.. ఒకానొక సమయంలో సువేందు అధికారిని సోదరుడిలా భావించానని ఆమె పేర్కొన్నారు. 2020 చివరి నుండి సువేందు అధికారి, బెనర్జీ మధ్య విభేదాలు ఉన్నాయి. అతను టీఎంసీ నుంచి బీజేపీకి మారగా, అసెంబ్లీ ఎన్నికల్లో నంద్రిగామ్ నుంచి పోటీ చేసి మమతను ఓడించారు. అసెంబ్లీలో 'రాజ్యాంగ దినోత్సవం' కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలో తన పేరు లేకపోవడంపై సువేందు అధికారి ఫిర్యాదు చేయడంతో సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తానని కూడా ఆయన తెలిపారు. సువేందు అధికారిని టీ తాగేందుకు పిలిచానని మమతా బెనర్జీ తెలుపగా, ఇది కేవలం మర్యాదపూర్వకమైన భేటీనేని, అంతకన్నా ఇంకేమీ లేదని, తాను టీ తాగలేదని ఆయన పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ స్పందించింది. ఆ పార్టీ నాయకుడు కమూర్జాన్ చౌదరి మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 'దీదీ-మోదీ- ప్యాచ్ అప్' జరుగుతోందని విమర్శించారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్‌పర్సన్ కారు అపహరణ

న్యూదిల్లీ: నైరుతి దిల్లీలోని జనక్‌పురి ప్రాంతంలోని ప్రధాన రహదారిపై తన కారు చోరీకి గురైందని కాంగ్రెస్ నేత, సోషల్ మీడియా చైర్‌పర్సన్ పంఖురి పాఠక్ తెలిపారు. ట్విట్టర్‌లో సీసీటీవీ ఫుటేజీని అప్‌లోడ్ చేస్తూ, తన కారు డోర్‌లు తెరిచేందుకు దొంగలు అనేక మార్గాలను ఎన్నుకున్నారని, చివరకు కారు డోరు గ్లాస్‌లు పగులగొట్టి కారు తీసుకెళ్లారని, పోలీసులు పట్టించుకోలేదని ఆమె పేర్కొన్నారు. జనక్‌పురి ప్రధాన రహదారిపై నా కారు దొంగతానానికి గురవగా, అది ఒక బ్యాంకు ముందు నిలిపి ఉంచారనీ, తన కారును దొంగిలించేందుకు దాదాపు వారికి అరగంట పట్టిందని ఆమె ట్వీట్ చేశారు. అంతకుముందు దిల్లీ సురక్షితంగా ఉండేది. ఇప్పుడు నేరాల రాజధానిగా మారిందని ఆమె విమర్శించారు. నేరస్థుల్ని పట్టుకోగలమన్న ఆశ ఉందా? అంటూ దిల్లీ పోలీస్ కమిషనర్, నైరుతి దిల్లీ డీసీపీని ట్యాగ్ చేస్తూ ప్రశ్నించారు.

'గే' దంపతుల పెళ్లి గుర్తింపుపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూదిల్లీ: ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం తమ పెళ్లికి గుర్తింపు ఇచ్చేలా మార్గదర్శనం చేయలంటూ గే దంపతులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనికి స్పందించిన కోర్టు తక్షణమే కేంద్రానికి, అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణికి నోటీసులు జారీ చేసింది. ఆయా పిటిషనల్‌పై తీర్పు ఇచ్చే ముందు సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి ఇచ్చిన వివరణలను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లి నేతృత్వంలో ధర్మాసనం విన్నది. ప్రత్యేక వివాహ చట్టం కింద ఇద్దరు స్వలింగ సంపర్కుల వివాహాన్ని గుర్తించాలని కోరుతూ పిటిషన్‌లు దాఖలు చేయబడ్డాయి. హైదరాబాద్‌లో నివసిస్తున్న స్వలింగ సంపర్కుల జంట సుప్రియో చక్రవర్తి, అభయ్ డాంగ్ ఒక పిటిషన్ దాఖలు చేయగా, రెండో పిటిషన్‌ను మరో స్వలింగ సంపర్కుల జంట పార్థ్ ఫిరోజ్ మెహ్రోత్రా, ఉదయ్ రాజ్ దాఖలు చేశారు. తమకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కును ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బైసెక్సువల్, లింగమార్పిడి, క్వీర్)కి చెందిన వ్యక్తులకు విస్తరింపజేయాలని వారు కోరుతున్నారు. స్వలింగ వివాహాలను గుర్తించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ప్రకారం సమానత్వం, జీవించే హక్కును ఉల్లంఘించడమేనని పిటిషన్ పేర్కొంది. 2018లో సుప్రీంకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా 158 ఏళ్ల వలస చట్టంలోని కొంత భాగాన్ని ఐపీసీలోని సెక్షన్ 377 ప్రకారం ఏకాభిప్రాయంతో కూడిన అసహజ సెక్స్‌ను నేరంగా పరిగణించింది.

డిస్‌ప్లే ఫొటోగా సుల్తాన్ ప్యాలెస్

న్యూదిల్లీ: అరా నుంచి అలహాబాద్ వరకు, అనేక మంది వారసత్వ ఔత్సాహికులు పాట్నాలోని సుల్తాన్ ప్యాలెస్‌ను పరిరక్షించడానికి మద్దతుగా తమ సోషల్ మీడియా ఖాతాల డిస్‌ప్లే చిత్రంగా పెట్టుకున్నారు. ప్యాలెస్ కూల్చివేసి, ఐదు నక్షత్రాల హోటల్‌ను నిర్మించే ప్రతిపాదనలపై పాట్నా హైకోర్టు స్టే విధించింది. పాట్నా హైకోర్టు సెప్టెంబర్‌లో స్టే విధించింది. వరల్డ్ హెరిటేజ్ వీక్‌లో సంఘీభావం కోసం ఆకస్మిక పిలుపులో భాగంగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లోని వ్యక్తులు వారి ప్రొఫైల్, కవర్ ఫోటోలను అప్‌డేట్ చేశారు. కొందరు గురువారం నుంచి ఫేస్‌బుక్‌లో వారి డిస్‌ప్లే ఫోటోను కూడా మార్చారు. శుక్రవారం మధ్యాహ్నం నాటికి అనేకమంది వినియోగదారులు 1922లో లెజెండరీ బారిస్టర్ సర్ సుల్తాన్ అహ్మద్ నిర్మించిన ఐకానిక్ ప్యాలెస్ చిత్రాన్ని ఉపయోగించి వారి ప్రొఫైల్ ఫోటోలను అప్‌డేట్ చేశారు.

మామ ఆస్తిపై కన్ను...వంద కోట్లకుపైగా మోసం

కొచ్చి: దుబాయ్‌కు చెందిన వ్యాపారి అబ్దుల్ లాహిర్ హస్సన్ తన కుమార్తెకు కేరళలోని కాసర్‌గోడ్‌కు చెందిన వ్యక్తితో 2017 వివాహం చేశాడు. ఆ సమయంలో తన కుమార్తెకు 1000 సవర్ల బంగారం బహుమతిగా ఇచ్చాడు. పెళ్లయి ఐదేళ్లు గడచిన తరువాత అల్లుడు తనను రూ.107 కోట్లకు మోసం చేశాడంటూ ఆరోపించాడు. ఏం జరుగుతోందో తెలుసుకునేలోపే, ఆయన అల్లుడు మహ్మద్ హాఫీజ్ తన పేర కొన్ని ఆస్తులు రాయించుకున్నాడని హస్సన్ అలువ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో డబ్బు వ్యవహారం రూ.100 కోట్లు కాగా, మహ్మద్ హాఫీజ్ ప్రస్తుతం గోవాలో ఉంటున్నాడు. ఈ కేసు విచారణను పోలీసులు కేరళ క్రైం బ్రాంచ్‌కు నవంబర్ 24న అందజేశారు. అనంతరం హస్సన్ ఓ మీడియాతో మాట్లాడుతూ నిందితుడిని అరెస్టు చేయడంలో అలువా పోలీసులు విఫలమయ్యారని, కనీసం విచారణకు పిలిచి ఎలాంటి ప్రశ్నలు అడగలేదని, తన అల్లుడిని ఉపయోగించుకోమని ఇచ్చిన కారును కూడా వాళ్లు స్వాధీనం చేసుకోలేదని వాపోయారు.

దేశం కంటే ఏ బంధం గొప్పది కాదు : మోదీ

న్యూదిల్లీ: దేశం కంటే ఏ బంధం పెద్దది కాదని, ఏ వ్యక్తి గొప్పకాదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఆయన శుక్రవారం అసోంలో అహోం జనరల్ లచిత్ బర్ఫుకన్ 400వ జయంత్యుత్సవంలో మాట్లాడారు. లచిత్ బర్ఫుకన్ జీవితం స్ఫూర్తి దాయకమని, దేశం ముందు ఏ బంధం గొప్పది కాదని ఆయనన్నారని, దేశ ప్రయోజనాల కోసం రక్త సంబంధీకులను శిక్షించడానికి లచిత్ వెనుకాడలేదని చెప్పారు. భారత్ నేడు వలసవాదం సంకెళ్లను తెంచుకొని ముందుకు సాగుతోందని నొక్కిచెప్పారు. వారసత్వాన్ని వేడుక చేసుకుంటోందని, అమరవీరులను గొప్పగా స్మరించుకుంటోందని మోదీ అన్నారు. భారతదేశ చరిత్ర వీరులగాథ అని అన్నారు. విజయాలు, త్యాగాలు, నిస్వార్థత, వీరత్వగాథల చరిత్ర మనదన్నారు. 'మనన్ని బానిసలు చేసిన బ్రిటిష్ అజెండాను స్వాతంత్ర్యం తర్వాత మార్చి ఉండాల్సింది. దేశం కోసం స్వాతంత్ర సమరంలో ప్రాణాలను త్యజించిన అనేకమంది అమరవీరుల గాథలు చరిత్రలో మరుగునపడ్డాయి. లచిత్ బర్ఫుకన్ త్యాగానికి అర్థం లేదా? చారిత్రక తప్పుల సవరణ ఇప్పుడు జరుగుతోంది' అని మోదీ అన్నారు.

నేడు రాజ్యాంగ దినోత్సవం- వేడుకలో పాల్గొనున్న ప్రధాని

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టులో శనివారం నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొనున్నట్లు పీఎంఓ శుక్రవారం తెలిపింది. ఇ-కోర్టు ప్రాజెక్టులో భాగంగా వర్చువల్ జస్టిస్ క్లాక్, 'జస్టిఐఎస్' మొబైల్ యాప్ 2.0, డిజిటల్ కోర్టు, ఎస్3వాస్ వెబ్‌సైట్లు వంటివి మోదీ ప్రారంభిస్తారని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయ మంత్రి కిరణ్ రిజీజు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు పాల్గొనున్నట్లు తెలిపింది. 2015 నుంచి నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. అంతకుముందు వరకు ఈరోజును న్యాయ దినోత్సవం (లా డే)గా జరుపుకునేవారు.

శ్రద్ధా హత్యకేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలి: అజిత్ పవార్

పూనే: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన శ్రద్ధావాకర్ హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి దోషిని కఠినంగా శిక్షించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు అజిత్ పవార్ అన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ... ఈ హత్య కేసులో పోలీసు శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే వారిపై కూడా విచారణ జరిపించాలన్నారు. ఒకరినొకరు నిందించుకోవడంలో అర్థం లేదు. ఈ కేసులో దోషిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడే వారికి ఉన్న ఏకైక శిక్ష మరణశిక్ష అని ఈ సమాజం తెలుసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారికి ఈ శిక్ష గుణపాఠం కావాలని అన్నారు.

బిగ్‌బీ పేరు, ఫొటో వాడకంపై కోర్టు ఆంక్షలు

న్యూదిల్లీ: వాణిజ్యపరమైన కార్యక్రమాల్లో అనుమతి లేకుండా తన పేరు, ఫొటో, గళం, వ్యక్తిగత లక్షణాలను ఉపయోగించడాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దిల్లీ హైకోర్టులో అమితాబ్ సివిల్ దావా వేశారు. ఆయన తరపున ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. 'అనేక కారణాలతో ఈ పిటిషన్ వేయాల్సి వచ్చింది. కొందరు టీ-షర్టులు తయారు చేసి అమితాబ్ ఫొటో వేస్తారు. మరికొందరు ఆయన పోస్టర్లను విక్రయిస్తారు. కొందరైతే అమితాబచ్చన్.కామ్ అంటే డొమైన్ క్రియేట్ చేసి వెబ్‌సైట్ కూడా పెట్టుస్తారు. అందుకే మేం కోర్టు రావాల్సి వచ్చింది' అని సాల్వే వాదించారు. ఈ వాదనలు విన్న దిల్లీ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బిగ్ బీ అనుమతి లేకుండా ఏ వ్యక్తిగానీ, సంస్థ గానీ ఆయన పేరు, ఫొటో, గళం ఉపయోగించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అమితాబ్ వ్యక్తిగత హక్కులకు భంగం కలిగేలా ఉన్న కంటెంట్‌ను తొలగించాలని ఐటీ శాఖ అధికారులు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లను కోర్టు ఆదేశించింది. కొన్ని సంస్థలు వారి ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసేందుకు అమితాబ్ అనుమతి లేకుండానే ఆయన సెలబ్రిటీ హోదాను ఉపయోగించడం ఆయనను బాధించిందని కోర్టు గుర్తించింది. ఇలాంటి వాటిని నిషేధించకపోతే.. కొన్ని కార్యకలాపాల వల్ల అమితాబ్‌కు చెడ్డ పేరు రావడంతో పాటు, ఆయనకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని న్యాయస్థానం పేర్కొంది. అందుకే.. అమితాబ్ అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, గళాన్ని ఎవరూ ఉపయోగించకూడదని కోర్టు స్పష్టం చేసింది.

ఆనంద్ తెల్తుంబ్డే బెయిల్‌పై ఎన్ఐఏ పిటిషన్ కొట్టివేత

న్యూదిల్లీ: ఎల్గార్ పరిషత్-మావోయిస్ట్ సంబంధాల కేసులో విద్యావేత్త, హక్కుల కార్యకర్త ఆనంద్ తెల్తుంబ్డేకు బాంబై హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సవాలు చేస్తూ ఎన్ఐఏ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. తెల్తుంబ్డేకు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 'పిటీషన్ కొట్టివేయబడింది. అయితే, హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఉన్న పరిశీలనలు విచారణలో నిశ్చయాత్మక తుది ఫలితాలుగా పరిగణించబడవు' అని సుప్రీంకోర్టు పేర్కొంది. తీవ్రవాద సంస్థతో అనుబంధం, వారికి మద్దతుకు సంబంధించి టెల్తుంబ్డేపై నమోదైన ఏకైక కేసులో గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందని పేర్కొంటూ హైకోర్టు నవంబర్ 18న అతనికి బెయిల్ మంజూరు చేసింది. నిషేధిత మావోయిస్టు సంస్థలో క్రియాశీల సభ్యుడిగా లేదా ఏదైనా ఉగ్రవాద చర్యకు పాల్పడ్డాడని చూపించడానికి ఎలాంటి ఆధారాలు లేవని కూడా పేర్కొంది. అయితే, హైకోర్టు తన బెయిల్ ఆర్డర్‌పై ఒక వారం పాటు స్టే విధించింది కాబట్టి ఎన్ఐఏ... హైకోర్టు ఆర్డర్‌పై సుప్రీంకోర్టులో సవాల్ చేయొచ్చు. ఈ కేసులో అరెస్టయిన 16 మందిలో 73 ఏళ్ల తెల్తుంబ్డే బెయిల్‌పై విడుదల కానున్న మూడో నిందితుడు. కవి వరవరరావు ప్రస్తుతం ఆరోగ్య కారణాలతో బెయిల్‌పై బయట ఉండగా, న్యాయవాది సుధా భరద్వాజ్ రెగ్యులర్ బెయిల్ పొందారు. ఏప్రిల్ 2020లో ఈ కేసులో అరెస్టయినప్పటి నుంచి తెల్తుంబ్డే నవీ ముంబైలోని తలోజా జైలులో ఉన్నారు. డిసెంబర్ 31, 2017న పూనె నగరంలో జరిగిన ఎల్గార్ పరిషత్ కార్యక్రమానికి తాను హాజరుకాలేదని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయలేదని ఆనంద్ తెల్తుంబ్డే పేర్కొన్నారు. నిషేధిత మావోయిస్టు సంస్థ మద్దతుతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారనేది ప్రాసిక్యూషన్ కేసు. ఈ కేసులో ట్రయల్ కోర్టు ఇంకా అభియోగాలు మోపలేదు, ఆ తర్వాత విచారణ ప్రారంభమవుతుంది.

ఉమర్‌ఖాలీద్ బెయిల్‌కు దిల్లీ పోలీసుల మోకాలడ్డు

న్యూదిల్లీ: ఈశాన్య దిల్లీ అల్లర్ల (2020) నిందితుడు ఉమర్ ఖాలీద్ తాత్కాలిక బెయిల్ పిటిషన్‌ను పోలీసులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు శుక్రవారం కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. అతని విడుదల సమాజంలో అశాంతికి కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఖలీద్... తన సోదరి వివాహం కోసం రెండు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అదనపు సెషన్స్ జడ్జి అమితాబ్ రావత్ ముందు దరఖాస్తును సమర్పించారు. కాగా దీనిపై సమాధానం ఇవ్వాలని దిల్లీ పోలీసులను కోర్టు ఆదేశించింది. డిసెంబరు 28న ఖాలీద్ సోదరి వివాహం జరుగుతున్న సంగతి వాస్తవమేనని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) ఎల్ఎం నేగి దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే నిందితుడు 'ఉపా' కింద తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొంటున్నందున అతని మధ్యంతర బెయిల్‌ను వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. అతని సాధారణ బెయిల్ పిటిషన్‌ను ఈ కోర్టు కొట్టివేసిందని, దానిపై అప్పీల్‌ను దిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించిందని తెలిపారు. ఖాలీద్ తల్లి బోటిక్ నడుపుతుండడం, అతని తండ్రి 'వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా' అనే రాజకీయ పార్టీకి నాయకత్వం వహిస్తున్నందున, వారు పెళ్లికి ఏర్పాట్లు చేయగలరని పేర్కొన్నారు. నిందితుడి విడుదలను తీవ్రంగా వ్యతిరేకించారు. తన మధ్యంతర బెయిల్ వ్యవధిలో అతను సోషల్ మీడియాను ఉపయోగించడం ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే అవకాశం ఉందని, ఇది సమాజంలో అశాంతిని కలిగిస్తుందని, అతను సాక్షులను కూడా ప్రభావితం చేయవచ్చునని దిల్లీ పోలీసులు తెలిపారు. కాగా కోర్టు తదుపరి విచారణను నవంబర్ 29కి వాయిదా వేసింది.

స్పీకర్ ఉత్తర్వులను సమర్థించిన ఉత్తరాఖండ్ హైకోర్టు

నైనిటాల్: రాష్ట్ర అసెంబ్లీ సచివాలయంలో 228 తాత్కాలిక నియామకాలను రద్దు చేస్తూ స్పీకర్ ఇచ్చిన ఉత్తర్వును ఉత్తరాఖండ్ హైకోర్టు సమర్థించింది. తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను చీఫ్ జస్టిస్ విపిన్ సంఘీ, జస్టిస్ ఆర్‌సీ ఖుల్బేలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం రద్దు చేస్తూ స్పీకర్ రీతూ ఖండూరి ఆదేశాలను సమర్థించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ సచివాలయం డివిజన్ బెంచ్‌లో ప్రత్యేక అప్పీల్ దాఖలు చేసింది. శాసనసభ సెక్రటేరియట్ తరపున, ఈ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన జరిగాయని, వారి సేవల నిబంధనల ప్రకారం నోటీసు లేకుండా ఎప్పుడైనా వారి సేవలను రద్దు చేయవచ్చని చెప్పారు.

ఉత్తరాఖండ్ శాసనసభ సచివాలయం నుంచి తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ విధానసభ దాఖలు చేసిన ప్రత్యేక అప్పీళ్లను హైకోర్టు గురువారం విచారించింది. తమ తొలగింపు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ డిస్మిస్ చేసిన ఉద్యోగుల్లో కొందరు స్పీకర్ ఉత్తర్వులను గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ముందు సవాలు చేశారు. డివిజన్ బెంచ్ ఆదేశాలపై స్పీకర్ రీతూ ఖండూరి స్పందిస్తూ, ఇది న్యాయం సాధించిన విజయమని అన్నారు. తాత్కాలిక నియామకాలు వెనుక ద్వారం గుండా జరిగాయని ఆరోపణల నేపథ్యంలో నిపుణుల విచారణ కమిటీ సిఫారసు మేరకు స్పీకర్ వాటిని రద్దు చేశారు.

పోలీస్ త్యాగానికి గుర్తుగా ఊరిపేరు మార్పు

సుల్తాన్‌పూర్ ఇక రాహుల్ నగర్

ముంబై: సుమారు వెయ్యిమంది జనాభా, 600 ఇళ్ల వరకు ఉన్న మహారాష్ట్రలోని సుల్తాన్‌పూర్ గ్రామం ఇకమీదట రాహుల్ నగర్‌గా మారనుంది. ఇందులో విశేషమేమిటంటే పద్నాలుగేళ్ల క్రితం (2008 నవంబరు 26) ముంబైపై ఉగ్రదాడి జరిగినప్పుడు సుల్తాన్‌పూర్‌కు చెందిన స్టేట్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (ఎస్‌ఆర్‌పిఎఫ్) కానిస్టేబుల్ రాహుల్ షిండే ఉగ్రవాదులతో పోరాడుతూ వీర మరణం చెందారు. అతని జ్ఞాపకార్థం సుల్తాన్‌పూర్‌వాసులు తమ ఊరిపేరును మార్చేసుకున్నారు. రాహుల్ స్వగ్రామం షోలాపూర్ జిల్లా మాధా తహసీల్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామానికి 'రాహుల్ నగర్'గా పేరు మార్చాలని గ్రామస్తులు నిర్ణయించారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. దక్షిణ ముంబైలోని తాజ్‌మహల్ ప్యాలెస్‌పై ఉగ్రవాదులు దాడిచేసినట్లు సమాచారం అందగానే హోటల్‌లోకి మొట్టమొదట ప్రవేశించిన పోలీస్ బృందంలో షిండే ఒకరు. ఉగ్రవాదుల కాల్పులకు ఎదురొడ్డి ప్రతి దాడి చేసిన షిండే కడుపులోకి బుల్లెట్‌లు దూసుకుపోవడంతో అతను మరణించాడు. షిండే అత్యున్నత త్యాగానికి గౌరవంగా ప్రభుత్వం రాష్ట్రపతి పోలీసు పతకాన్ని ప్రదానం చేయగా, సుల్తాన్‌పూర్ నివాసితులు అతను పుట్టి పెరిగిన గ్రామానికి రాహుల్ షిండే పేరు పెట్టాలని నిర్ణయించుకున్నారు. అయితే అధికారికంగా పేరు మార్చే కార్యక్రమం ఇంకా జరగాల్సి ఉంది. 'గ్రామం పేరు మార్చడానికి అన్ని ప్రభుత్వ లాంఛనాలు పూర్తయ్యాయి. అధికారికంగా పేరు మార్చే కార్యక్రమం కోసం మేము ఇప్పుడు ఎదురుచూస్తున్నాము' అని రాహుల్ షిండే తండ్రి సుభాష్ విష్ణు షిండే పీటీఐకి చెప్పారు. వీర మరణం పొందిన తన కుమారుడి గురించి మాట్లాడుతూ... షిండే ఉగ్రవాదులతో ధైర్యంగా పోరాడాడని, దేశం కోసం అత్యున్నత త్యాగం చేశాడని అన్నారు.నా కొడుకుని చూసి గర్విస్తున్నానన్నారు. సుభాష్ షిండేకి మరో ఇద్దరు పిల్లలు - ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన ఇప్పుడు తన చిన్న కొడుకుతో కలిసి ఉంటున్నారు. రాహుల్ మరణానంతరం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని, ముంబైలో ఫ్లాట్‌తోపాటు తాలూకా స్థలంలో గ్యాస్ ఏజెన్సీ లభించిందని, దీనివల్ల కుటుంబానికి జీవనోపాధి కలుగుతోందని సుభాష్ చెప్పారు. 2010లో షిండే గ్రామంలో రాహుల్ స్మారక చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేశారు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కుటుంబానికి అందిన రూ.10 లక్షల సాయం స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయడానికి ఉపయోగించినట్లు ఆయన తెలిపారు.

గుజరాత్ తొలిదశ ఎన్నికలు

21% అభ్యర్థులు నేరచరితులు

211 మంది కోటీశ్వర్లు

అందులో బీజేపీ వారు 79 మంది

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీకి మొదటి విడతగా డిసెంబరు1 జరిగే ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 21% మందిపై క్రిమినల్ కేసులున్నాయి. మొదటి విడతలో 89 స్థానాలలో పోలింగ్ జరుగుతోంది. ఇక్కడ 788 మంది అభ్యర్థులు పోటీచేస్తున్నారు. వీరిలో 167 మందిపై క్రిమినల్ కేసులున్నాయి. అందులో వంద మంది హత్య, అత్యాచారం వంటి తీవ్ర నేరారోపణలను ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) వెల్లడించింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారిలో అమ్ ఆద్మీపార్టీ (ఆప్) ఆ తరువాత స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులున్నారని తెలిపింది. పోటీలో ఉన్న 788 మందిలో 211 మంది కోట్లకు పడగలెత్తిన వారు కాగా వీరిలో అత్యధికంగా బీజేపీకి చెందిన 79 మంది ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. రాజ్‌కోట్ సౌత్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి రమేశ్ తిలాలా రూ.175 కోట్ల ప్రకటిత ఆస్తులతో అత్యంత ధనికుడు కాగా రాజ్‌కోట్ వెస్ట్ నుంచి స్వతంత్ర అభ్యర్థి భూపేంద్ర పటోలియా ఎటువంటి ఆస్తులు లేవంటూ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారని పేర్కొంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల్లో 89 శాతం మంది కోటీశ్వరులేనని ఆ నివేదిక పేర్కొంది. గతంతో పోలిస్తే ఈ దఫా కోటీశ్వరుల సంఖ్య పెరిగిందని తెలిపింది. మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరి సగటు ఆస్తి విలువ రూ.13.4 కోట్లుగా పేర్కొంది.

రాజ్‌గురు రాజ్‌కోట్ ఈస్ట్ నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్‌కు చెందిన ఇంద్రనీల్ రూ.162 కోట్లతో రెండో సంపన్న అభ్యర్థిగా నిలిచారని ఆ నివేదిక పేర్కొంది. ఈ ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సంపన్న అభ్యర్థులకే టిక్కెట్లు జారీ చేయడంతో ఈ ఎన్నికల్లో ధనబలం స్పష్టంగా కనిపిస్తోందని ఏడీఆర్‌కు చెందిన జనరల్ మేజర్ (రిటైర్డ్) అనిల్ వర్మ తెలిపారు. ఈ దఫా మొదటి విడత ఎన్నికల్లో 788 మంది అభ్యర్థుల్లో 27 శాతం మంది కోటీశ్వరులు కాగా, 2017 అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో ఈ సంఖ్య 21 శాతంగా ఉంది. ఈ దఫా 89 మంది బీజేపీ అభ్యర్థుల్లో 79 మంది కోటీశ్వరులు కాగా, కాంగ్రెస్ అభ్యర్థుల్లో 73 శాతం మంది, ఆప్ అభ్యర్థుల్లో 33శాతం మంది కోటి రూపాయల ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారని ఆ నివేదిక తెలిపింది.

బీజేపీ, వైసీపీ వ్యతిరేక కూటమి అవసరం

- సీపీఐ కార్యదర్శి నారాయణ
- పోరాటాలపై దృష్టిపెట్టాలి: రామకృష్ణ

విశాలాంధ్ర - విశాఖ: రాష్ట్రం మేలు కోసం బీజేపీ-వైసీపీకి వ్యతిరేకంగా మిగతా రాజకీయ పార్టీలు కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. విశాఖలో శుక్రవారం సీపీఐ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిందని అన్నారు. చిలక ప్రాణం మాంత్రికుడి గుప్పెట్లో ఉన్నట్టు జగన్ ఊపిరి ప్రధానమంత్రి మోదీ చేతుల్లో ఉందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని వైసీపీ ప్రభుత్వం నిలదీసే పరిస్థితి లేదని చెప్పారు కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఒక వేదిక మీదకు రావలసిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని స్వతంత్ర సంస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకుని నడిపిస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ నియామక పద్ధతిని సుప్రీంకోర్టు ప్రశ్నించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సీబీఐ చీఫ్‌ని అర్ధరాత్రి మార్చేశారని ఆ తరువాత నియమించిన సీబీఐ చీఫ్‌ని కూడా చెప్పిన పని చేయలేదని ఫైర్ సర్వీస్ కి మార్చేశారని విమర్శించారు. ప్రధాని అనుమతి మేరకే షెడ్యూల్‌ని ప్రకటించే పరిస్థితుల్లో ఎన్నికల సంఘం ఉందన్నారు. నోట్ల రద్దు వద్దని చెప్పిన ఆర్బీఐ గవర్నర్ రఘురామరాజన్‌ని మార్చేశారని తెలిపారు. అనుకూలుడైన ఊర్జిత్ పటేల్‌కి ఆ పదవిని కట్టబెట్టారని చెప్పారు. నోట్ల రద్దు వల్ల కోట్లాది రూపాయలు బ్లాక్‌మనీ ఉన్న వారెవరు ఇబ్బంది పడలేదని, పేదలే నానా అవస్థలకు గురయ్యారని చెప్పారు. ఆర్బీఐ విడుదల చేయక ముందే రెండు వేల రూపాయల నోట్లు కొట్లాది రూపాయల నల్లధనం ఉన్న వారి చేతుల్లోకి వెళ్లాయని చెప్పారు. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో కమ్యూనిస్టులకు సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. క్యూబాలో అంతర్జాతీయ కమ్యూనిస్టు అండ్ వర్కర్స్ పార్టీ సమావేశం జరిగిందని, 33 దేశాలతో వర్కింగ్ కమిటీ ఏర్పడిందని తెలిపారు. లాటిన్ అమెరికాలోని వెనిజులా, పెరూ, బ్రెజిల్‌లో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయని చెప్పారు కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని సామ్రాజ్యవాద అమెరికా ఇబ్బందులకు గురిచేస్తోందని నారాయణ తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్‌కి ఎవరు అడ్డం వచ్చారని, స్టీల్ ప్లాంట్ ఏర్పడితే రాయలసీమ అభివృద్ధి చెందదా? అని ప్రశ్నించారు. కేంద్రం మెడలు ఉంచి రాష్ట్ర ప్రయోజనాలు సాధిస్తానని చెప్పిన జగన్ ఇప్పుడు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇటీవల జరిగిన సీపీఐ రాష్ట్ర, జాతీయ మహాసభలు విజయవంతమయ్యాయని చెప్పారు. పార్టీ కార్యకర్తలు పోరాటాలపై దృష్టి కేంద్రీకరించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 2025 నాటికి కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతుందని అన్నారు. అప్పటికి పార్టీ సభ్యత్వాన్ని పది లక్షలకు చేర్చాలని, వారికి రాజకీయ సైద్ధాంతిక శిక్షణ ఇవ్వాలని అన్నారు. కేంద్రంలో బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే వారిని పక్కన పెట్టి లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రజా సంఘాలు తమ కార్యక్రమాలను మరింతగా విస్తరించాలని సూచించారు. ఏజీ స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె సత్యాంజనేయ, కె సత్యనారాయణ, ఎ విమల, ఎస్ కె రెహమాన్, పి చంద్రశేఖర్, ఆర్ శ్రీనివాసరావు, సి ఎన్ క్షేత్ర పాల్, జి రాంబాబు, జి ఎస్ జె అచ్యుతరావు జిల్లా సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు

ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షుడిగా పల్లవ్ సేన్ గుప్తా

హనోయి: వియత్నాంలో జరుగుతున్న 22వ ప్రపంచ శాంతి సంఘం (డబ్ల్యూపీసీ) సమావేశాలు విజయవంతమయ్యాయి. డబ్ల్యూపీసీ అధ్యక్షుడిగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి పల్లవ్ సేన్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ నేత రమేశ్ చంద్ర తర్వాత ఈ అత్యున్నత హోదాను పొందిన రెండవ భారతీయుడు పల్లవ్ సేన్ గుప్తా కావడం విశేషం. ప్రపంచ శాంతి మండలి సంఘం 4వ రోజు సమావేశంలో 40 మంది సభ్యులతో కొత్త పదవీకాలానికి బోర్డు కమిటీని ఎన్నుకున్నారు. అథనాసియోస్ పాఫిలిస్ సెక్రటరీ-జనరల్‌గా తిరిగి ఎన్నికయ్యారు. ఇరాక్లిస్ త్సవదారిడిస్ కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. కాగా ఈ సమావేశాలు డబ్ల్యూపీసీ 70 ఏళ్ల చరిత్రలో ఒక కొత్త మైలురాయిని సృష్టించాయని వియత్నాం యూనియన్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ ఆర్గనైజేషన్స్ (వీయూఎఫ్‌వో) అంబాసిడర్ న్గుయెన్ ఫువాంగ్ శుక్రవారం అన్నారు. ప్రపంచంలోని ప్రగతిశీల, శాంతి-ప్రేమికుల శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు, డబ్ల్యూపీసీతో స్నేహం, సహకారం ఉన్న సంస్థలతో సహా 50 దేశాల నుంచి దాదాపు 100 మంది ప్రతినిధులతో వియత్నాంలో ఈ సమావేశాలు నిర్వహించడం ఇదే మొదటిసారి అని ఆయన తెలిపారు. సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి, శాంతి, న్యాయం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, స్థిరమైన అభివృద్ధి కోసం పోరాటం కొనసాగించడానికి ప్రపంచంలోని శాంతి-ప్రియమైన, ప్రగతిశీల శక్తులను ఒకచోట చేర్చడానికి సంకల్పం సందేశాన్ని చూపే రాజకీయ ప్రకటనను స్వీకరించడానికి ప్రతినిధులు అంగీకరించారు. ఈ సందేశం ప్రస్తుత సందర్భంలో, ప్రత్యేకించి ప్రపంచం యుద్ధాలు, సాంప్రదాయేతర భద్రతా సవాళ్లు, పర్యావరణ క్షీణత ప్రమాదాలను ఎదుర్కొంటున్న సమయంలో ప్రాముఖ్యతను కలిగి ఉంది.

వెబ్‌లో ఓటరు ఫొటో గుర్తింపు ప్రదర్శించాలి

- అర్హతల ఆధార పత్రాలు ఉంచాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్
- రాజకీయ పార్టీలతో ఎన్నికల ముఖ్య అధికారి సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓటరు ఫొటో గుర్తింపుతోపాటు వారి అర్హతల ఆధార పత్రాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ కోరారు. త్వరలో జరగనున్న పశ్చిమ, తూర్పు రాయలసీమ, ఉత్తరాంధ్ర నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్ల జాబితా పరిశీలన కోసం, చిత్తు ప్రతులు అందజేసే నిమిత్తం రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల ముఖ్య అధికారి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సీపీఐ తరపున జల్లి విల్సన్ హాజరయ్యారు. ఈ దిగువ అంశాలను ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లి, అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 23న ప్రచురించిన ఓటరు జాబితాలో ఓటరు గుర్తింపుతోపాటు వారి అర్హత, తగిన ఆధార పత్రాలు వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తే ఇతరులు నిశితంగా పరిశీలిస్తారనీ, వాస్తవాలు బయటకు వస్తాయని వివరించారు. ఎలక్షన్ కమిషన్ పక్కాగా వ్యవహరించాలని కోరారు. ఒక్క ఓటరే ఐదారు చోట్ల చిన్న మార్పులతో నమోదయ్యారనీ, సాఫ్ట్ కాపీ ద్వారా వాటిని వేరు చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని కోరారు. ఫిర్యాదు వచ్చిన ప్రతి ఓటరును నిశితంగా పరిశీలించేందుకు ప్రతి జిల్లాలో ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలన్నారు. ఎన్నికల అధికారి కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై నిశితంగా పరిశీలించి, పక్కాగా వ్యవహరిస్తే ఒక పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి దాదాపు 1/3వవంతు దొంగ ఓట్లు తొలగించవచ్చని జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు.

ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచాలి: సీపీఎం

ఓటర్ల జాబితా వివరాలను అందరికీ అందుబాటులో ఉంచేలా ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాలని సీపీఎం తెలిపింది. రాజకీయ పార్టీల సమావేశం అనంతరం ఎన్నికల అధికారికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, కే ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు జే జయరామ్ వినతిపత్రం అందజేశారు. తిరస్కరించిన ఓటర్ల జాబితాను ప్రకటించాలని, దీనివల్ల అభ్యంతరాలు చెప్పడానికీ, మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు సులభతరం అవుతుందన్నారు. ఓటర్ల దరఖాస్తు, సర్వీసు/డిగ్రీ ధ్రువీకరణ పత్రాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచాలని తదితర అంశాలతో వినతిపత్రం ఇచ్చారు.

సంప్రదింపులకు సముచిత సమయమివ్వాలి

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై తమతో సంప్రదింపులు జరిపేందుకు కేవలం 75 నిమిషాల వర్చువల్ సమావేశాన్ని నిర్వహిస్తామనడంపై 12 కేంద్ర కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. సోమవారం (28వ తేదీ) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు వర్చువల్‌గా బడ్జెట్‌కు ముందు జరిపే సంప్రదింపుల్లో పాల్గొనాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలకు గురువారం ఆర్థిక వ్యవహారాల శాఖ సీనియర్ సలహాదారు రాజీవ్ మిశ్రా ఓ లేఖ పంపారు. కోవిడ్ ఆంక్షలను పూర్తిగా సడలించిన తర్వాత కూడా వర్చువల్ సమావేశాన్ని నిర్వహించడమే కాకుండా 75 నిమిషాలు మాత్రమే కేటాయించడాన్ని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, సేవా, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంయుక్తంగా వ్యతిరేకిం చాయి. 12 కేంద్ర కార్మిక సంఘాలతో సంప్రదింపులకు ఇంత తక్కువ సమయాన్ని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించాయి. సంప్రదాయ బద్ధంగా సమావేశం ప్రారంభం మాట్లాడేదీ పరిగణనలోకి తీసుకుంటే ఒక్కో సంస్థకు కనీసం ఐదు నిమిషాలు కూడా లభించని పరిస్థితి ఉంటుందన్నాయి. దేశ జీడీపీకి, మొత్తం ఆర్థిక వ్యవస్థకు తోడ్పడే కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే కేంద్ర కార్మిక సంఘాలతో ఇటువంటి సంప్రదింపుల ప్రక్రియ ప్రజాస్వామ్యంలో సమంజసమైనది కాదని తేల్చిచెప్పారు. దీనిపై కేంద్రం పునరాలోచించాలని సూచించింది. సముచిత సమయాన్ని కేటాయిస్తూ భౌతిక సమావేశాన్ని నిర్వహించాలని కోరాయి.

సావర్కర్‌ను స్తుతించేందుకే...

చరిత్రను తిరగరాయాలన్న షా పిలుపుపై సీపీఐ ఎంపీ విశ్వం

న్యూఢిల్లీ: చరిత్రను తిరగరాయాలని హోంమంత్రి అమిత్‌షా పిలుపు ఇవ్వడం చరిత్ర నైతికతపై దాడి చేయడమే కాకుండా వాస్తవాలను వక్రీకరించే యత్నమని సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం విమర్శించారు. సావర్కర్‌ను స్తుతించి నెహ్రూను దిగజార్చడమేనని అమిత్‌షా పిలుపు ఉద్దేశమని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. భారత్ ఆలోచనను తక్కువ చేసి వాస్తవాలను వక్రీకరించాలని చూస్తున్నారన్నారు. ఆయన పిలుపు చరిత్రకారులకు అవమానకరమని, వారి నుంచి ప్రతిఘటన తప్పదని వినయ్ విశ్వం ట్వీట్ చేశారు. అహోం జనరల్ లచిత్ బర్ఫుకన్ 400వ జయంత్యుత్సవంలో భాగంగా నిర్వహించిన ప్లీనరీలో అమిత్‌షా మాట్లాడుతూ చరిత్రను తిరిగి రాయాలని పిలుపుఇచ్చారు. 30 మహోన్నత భారతీయ సామ్రాజ్యాలు, మాతృభూమి కోసం వీరోచితంగా పోరాడిన 300 యోధుల గురించి అధ్యయనం చేసి రాయాలని విద్యావేత్తలను అమిత్‌షా కోరారు.

జపాన్‌లో 'ఆర్ఆర్ఆర్' సంచలనం

హైదరాబాద్: దర్శకధీరుడు ఎస్ఎస్. రాజమౌళి తెరకెక్కించిన సినిమా 'ఆర్ఆర్ఆర్'. రామ్ చరణ్, జూనియర్ ఎన్‌టీఆర్ హీరోలుగా నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. భారీ స్థాయి వసూళ్లు రాబట్టింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.1200కోట్ల కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. ఈ చిత్రం అక్టోబర్ 21న జపాన్‌లో విడుదలైంది. అక్కడ కూడా భారీ స్థాయి వసూళ్లను రాబడుతోంది. అత్యంత వేగంగా 300మిలియన్ జపనీస్ యెన్ కలెక్షన్స్‌ను కొల్లగొట్టిన చిత్రంగా రికార్డు సృష్టించింది. జపాన్‌లోని 44నగరాల్లో, 209స్క్రీన్స్‌లో, 31ఐమ్యాక్స్ స్క్రీన్స్‌లో 'ఆర్ఆర్ఆర్' విడుదలైంది. 305మిలియన్ జపనీస్ యెన్ వసూళ్లను రాబట్టింది. ఇండియన్ కరెన్సీలో ఈ కలెక్షన్స్ రూ.17.9కోట్లకు సమానం. ఈ చిత్రాన్ని 34రోజుల్లో 2లక్షల మంది వీక్షించారు. జపాన్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా రికార్డు ఇప్పటికి 'ముత్తు' పేరిట ఉంది. 24ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం 400మిలియన్ జపనీస్ యెన్ కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది. ప్రస్తుతం రెండో స్థానంలో 'ఆర్ఆర్ఆర్' ఉంది.

128 మందికి సంగీత్ నాటక్ అకాడమీ పురస్కారాలు

మరో పదిమందికి ఫెల్లోషిప్

న్యూఢిల్లీ: సంగీతం, నృత్యం, నాటకాల జాతీయ అకాడమీ అయిన సంగీత్ నాటక్ అకాడమీ 2019, 2020, 2021 సంవత్సరాలకుగాను అవార్డులను ప్రకటించింది. వేర్వేరు రంగాల్లో అద్భుత కళను ప్రదర్శించిన 128 మంది కళాకారు లను అవార్డులతో సత్కరించున్నది. మరో పది మంది ప్రముఖులకు అకాడమీ ఫెల్లోషిప్‌తో సన్మానించనుంది. ప్రతిష్ఠాత్మకమైన అకాడమీ ఫెల్లోషిప్‌ను 40 మందికి మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం పది మందిని ఎంపిక చేయగా సంగీత్ నాటక్ అకాడమీ ఫెల్లోలుగా 39 మంది ఉన్నారు. సంగీతం, నృత్యం, థియేటర్, సంప్రదాయ కళలు, జానపదాలు, గిరిజన సంగీతం, నాటకాలు, తోలుబొమ్మలాట వంటి రంగాల్లో ప్రవీణులతో పాటు వివిధ కళలకు గణనీయమైన తోడ్పాటు అందించిన వారికి పురస్కారాలు అందజేయనుంది. మొత్తం 128 ఈ అవార్డుకు ఎంపిక కాగా వీరిలో ముగ్గురు తమ పురస్కారాన్ని పంచుకోవాల్సి ఉన్నదని అకాడమీ తెలిపింది. అకాడమీ ఫెల్లోను రూ.3లక్షల పర్సుమనీ వరిస్తుంది. అకాడమీ అవార్డు గ్రహీతకు రూ.లక్ష నగదుతో పాటు తామరపత్రం, అంగవస్త్రం అందజేస్తారు. ప్రత్యేక వేడుకలో ఈ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేస్తారు.

బడ్జెట్ కసరత్తు

రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సీతారామన్ భేటీ

న్యూఢిల్లీ: 2023-24 బడ్జెట్‌కు సంబంధించిన సలహాలు, సూచనల కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులతో శుక్రవారం ముందస్తు బడ్జెట్ సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. ఢిల్లీలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. సీతారామన్‌తో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, భగవత్ కరాడ్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ తదితరులు హాజరయ్యారు. ఆర్థిక మంత్రి సీతారామన్ ఇప్పటివరకు అనేక బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల నిపుణుల బృందానికి, వ్యవసాయ, ఆహార శుద్ధి పరిశ్రమ నిపుణులతో సహా పరిశ్రమల నాయకులకు అధ్యక్షత వహించారు కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేయడానికి అధికారిక కసరత్తు అక్టోబర్ 10 నుంచి ప్రారంభమయింది.

జయప్రదకు ఎన్టీఆర్ శతాబ్ది పురస్కారం

హైదరాబాద్: నందమూరి బాలకృష్ణ గౌరవ అధ్యక్షతన, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో సంవత్సర కాలం పాటు విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో భాగంగా తెనాలిలో ఈనెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు నాజర్ పేట ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార మహోత్సవ సభ జరగ నుంది. డైలాగ్స్ రైటర్ డాక్టర్ సాయి మాధవ్ బుర్రా సభ నిర్వహణలో ఎన్టీఆర్ శతాబ్ది చలన చిత్ర పురస్కారాన్ని నటి జయప్రదకు ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ అందించబోతున్నారు. ఇక ఈ కార్యక్రమానికి జయప్రకాశ్ నారా యణ ముఖ్య అతిథిగా, సుప్రసిద్ధ సినీ దర్శకుడు ఏ కోదండరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా వ్యవహరించనున్నారు. వీరు మాత్రమే కాకుండా ఎన్టీఆర్ అభిమాన సత్కార గ్రహీత డాక్టర్ మైథిలి అబ్బరాజు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ శతజయంతి ఉత్సవాలలో భాగంగా.. తెనాలి పెమ్మసాని (రామకృష్ణ) థియేటర్‌లో ఏడాది పొడవునా ఎన్టీఆర్ చలన చిత్రాలు ప్రదర్శింపబడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'అడవి రాముడు' సినిమాను ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శనకు జయప్రద, నందమూరి రామకృష్ణ, ఏ. కోదండరామిరెడ్డి హాజరై ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించనున్నారు.

వెబ్ సిరీస్‌తో శాంతిప్రియ రీఎంట్రీ

హైదరాబాద్: 1990 ప్రాంతంలో నటిగా వెలుగొందిన నిషాంతి అలియాస్ శాంతిప్రియ ఇప్పుడు మళ్ళీ రీఎంట్రీ ఇస్తోంది. ఆమె సీనియర్ నటి భానుప్రియ చెల్లెలు. తెలుగులో 1988లో వచ్చిన 'మహర్షి' చిత్రంతోనూ, అదే సంవత్సరం వచ్చిన 'ఎంగ ఊరు పాట్టుక్కారన్' తమిళ చిత్రంతోనూ ఆమె టాలీవుడ్, కోలీవుడ్‌లో నటిగా పరిచయమైంది. ఆ తర్వాత వరుసగా 'రయిలుక్కు నేరమాచ్చు' (1988), 'సిగప్పు తాళి' (1988) వంటి అనేక తమిళ చిత్రాల్లో నటిం చిన శాంతిప్రియ 1990 కాలంలో ఓ వెలుగు వెలిగింది. తెలుగులోనూ ఆమె అనేక చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత తన కుటుంబం కోసం సమయాన్ని వెచ్చించే నిమిత్తం సినిమాలకు దూరమైంది. ఇప్పుడు మళ్లీ ఓ వెబ్ సిరీస్ ద్వారా రీ ఎంట్రీ ఇస్తోంది. ఎంఎక్స్ ప్లేయర్ రూపొందించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ధారావి బ్యాంక్' అనే వెబ్ సిరీస్‌లో ఆమె నటించింది. ఇందులో సునీల్ శెట్టి సోదరిగా 'బోనమ్మ' అనే పాత్రలో పోషించింది. అలాగే, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కే 'సరోజిని నాయుడు-ది అన్‌సంగ్ ఫ్రీడం ఫైటర్'లో కూడా శాంతిప్రియ నటిస్తున్నారు. వీటితోపాటు తమిళం, తెలుగు భాషల్లో నటించే విషయమై సంప్రదింపులు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

కొంపముంచిన శార్దూల్

తొలి వన్డేలో కివీస్‌పై టీమిండియా పరాజయం

ఆదివారం రెండో వన్డే

అక్లాండ్: న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా జోరుకు బ్రేక్ పడింది. మూడు టీ20ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకున్న టీమిండియా.. వన్డే సిరీస్‌లో ఆ జోరును కొనసాగించలేకపోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో బౌలింగ్‌లో విఫలమైన గబ్బర్ సేన 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓటమి పాలైంది. 307 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా కాపాడు కోలేకపోయింది. ముఖ్యంగా టీమిండియా ఫలితాన్ని న్యూజి లాండ్ ఇన్నింగ్స్ 40వ ఓవర్ శాసించింది. శార్దూల్ ఠాకూర్ వేసిన ఈ ఓవరే మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్ అయ్యింది.

సిక్స్, 4 బౌండరీలతో..

39వ ఓవర్ వరకు భారత విజయవకాశాలు సజీవంగా ఉండగా.. 40వ ఓవర్‌లో టామ్ లాథమ్ ఒక సిక్స్, నాలుగు బౌండరీలతో 25 పరుగులు పిండుకోవడంతో మ్యాచ్ మొత్తం న్యూజిలాండ్ వైపు మళ్లింది. శార్దూల్ ఠాకూర్ వేసిన ఈ ఓవర్ తొలి బంతిని టామ్ లాథమ్ డీప్ బ్యాక్‌వార్డ్ దిశగా సిక్సర్ బాదాడు. రెండో బంతిని శార్దూల్ వైడ్ వేయగా.. ఎక్స్‌ట్రా బాల్‌ను ఠాకూర్ బౌండరీ తరలించాడు. ఆ తర్వాత మరో మూడు బంతులను బౌండరీలుగా మలిచాడు. తీవ్ర ఒత్తిడికి గురైన ఠాకూర్ చివరి బంతిని మరో వైడ్ వేయగా.. మరో ఎక్స్‌ట్రా డెలివరీకి సింగిల్ తీసిన లాథమ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పదే పదే షార్ట్ బాల్స్ వేసిన శార్దూల్ ఠాకూర్ మూల్యం చెల్లించుకున్నాడు.

ఒక్క ఓవర్‌తో రాక్షసుడిగా..

అభిమానులతో ముద్దుగా లార్డ్ శార్దూల్‌గా పిలుచుకునే అతను ఈ ఒక్క ఓవర్‌తో రాక్షసుడిగా మారాడు. ఈ ఓవర్ గనుక కట్టుదిట్టంగా వేసుంటే మ్యాచ్ ఆఖరి బంతి వరకు రసవత్తరంగా సాగేది. కేన్ విలియమ్సన్-టామ్ లాథమ్ నాలుగో వికెట్‌కు అందించిన 221 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేసినా ఫలితం మరోలా ఉండేది. మొత్తానికి పేలవ బౌలింగ్‌తో టీమిండియా సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమిపాలైంది. మ్యాచ్ అనంతరం రెండు జట్ల కెప్టెన్లు కూడా.. శార్దూల్ ఠాకూర్ వేసిన 40వ ఓవరే టర్నింగ్ పాయింట్ అని అభిప్రాయపడ్డారు.

భారీ స్కోర్ చేసినా..

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 306 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రేయస్ అయ్యర్(76 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 80), శిఖర్ ధావన్(77 బంతుల్లో 13 ఫోర్లతో 72), శుభ్‌మన్ గిల్(65 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించగా... చివర్లో వాషింగ్టన్ సుందర్(16 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 37 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో టీమ్ సౌథీ, లూకీ ఫెర్గూసన్ మూడేసి వికెట్లు తీయగా.. ఆడమ్ మిల్నే ఓ వికెట్ పడగొట్టాడు.

ఉమ్రాన్ మాలిక్ మినహా..

అనంతరం లక్ష్యచేధనకు దిగిన న్యూజిలాండ్ 47.1 ఓవర్లలో 3 వికెట్లకు 309 పరుగులు చేసింది. టామ్ లాథమ్(104 బంతుల్లో 19 ఫోర్లు, 5 సిక్సర్లతో 145 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. కేన్ విలియమ్సన్(98 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 94 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో ఉమ్రాన్ మాలిక్ రెండు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ పడగొట్టాడు. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0తో ఆధిక్యంలో నిలవగా.. రెండో వన్డే ఆదివారం జరగనుంది.

రిటైర్మెంట్ దిశగా 'డీకే' అడుగులు?

ఇన్‌స్టాలో భావోద్వేగ పోస్టు

ముంబై: టీమిండియా వెటరన్ బ్యాటర్ దినేశ్ కార్తీక్ త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ తీసుకునే అవకాశం ఉందంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. చాలా కాలంపాటు టీమిండియాకు దూరమైన దినేశ్ కార్తీక్ ఈ ఏడాది నిర్వహించిన భారత టీ20 లీగ్‌లో అదరగొట్టి తిరిగి జాతీయ జట్టులో చోటు సంపాదించాడు. ముఖ్యంగా పునరాగమనం తర్వాత కొన్ని మ్యాచ్‌ల్లో చివరి ఓవర్లలో వేగంగా పరుగులు రాబట్టి బెస్ట్ ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఆసియా కప్, టీ20 ప్రపంచకప్‌లో చోటు దక్కించుకున్నాడు. అయితే, టీ20 ప్రపంచకప్‌లో దినేశ్ కార్తీక్ ఆశించిన మేరకు రాణించలేకపోయాడు. దీంతో అతడిపై వేటుపడింది. ఇటీవల న్యూజిలాండ్‌తో ముగిసిన మూడు టీ20ల సిరీస్, ప్రస్తుతం జరుగుతోన్న మూడు వన్డేల సిరీస్‌కు ఈ వెటరన్ ఆటగాడిని ఎంపిక చేయలేదు. దీంతో తాజాగా ఇన్‌స్టాలో దినేశ్ కార్తీక్ పోస్ట్ చేసిన ఎమోషనల్ వీడియోనే ఈ చర్చకు దారితీసింది. 'టీమిండియా తరపున టీ 20 ప్రపంచ కప్ ఆడాలనే లక్ష్యం కోసం చాలా కష్టపడ్డాను. ఇప్పుడా కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది. మేం ఈ టోర్నీలో విజయం సాధించకపోవచ్చు.. కానీ ఎన్నో జ్ఞాపకాలు నా జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. నాకు మద్దతుగా నిలిచిన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, స్నేహితులు, ముఖ్యంగా అభిమానులకు నా ధన్యవాదాలు' అని దినేశ్ కార్తీక్ భావోద్వేగపూరిత పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ ద్వారా తన రిటైర్మెంట్ గురించి సంకేతాలిచ్చాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. 37ఏళ్ల దినేశ్ కార్తీక్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో చూడాలి మరి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.